# పరామర్శకు వెళ్తున్న భారాస నేతల అరెస్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:** షాబాద్‌లో బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు బయల్దేరిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డిలను ఫ్యూచర్‌సిటీ పోలీసులు మల్కాపూర్ గేట్ వద్ద అడ్డుకుని చేవెళ్ల ఠాణాకు తరలించారు. సబితా ఇంద్రారెడ్డితో కలిసి వచ్చిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పోలీసుల నుంచి తప్పించుకుని షాబాద్ చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శిస్తూ ఆందోళనలో పాల్గొన్నారు. మరోవైపు షాబాద్‌కు బయల్దేరిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, భారాస నేత ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్‌లను చేవెళ్లలో పోలీసులు అడ్డుకుని శంకర్‌పల్లి ఠాణాకు తరలించారు.

మిగతా 5లో...

పెన్ పవర్
తెలంగాణ రౌండప్




# ‘ఎస్ఐఆర్’ను నిర్లక్ష్యం చేస్తే..! మీ ‘ఓటు’ గల్లంతే..!

దుండిగల్ డిప్యూటీ కమిషనర్/ ఏఈఆర్ఓ డా. ఎస్. వెంకట మణి కరణ్ విజ్ఞప్తి..



దుండిగల్ డిప్యూటీ కమిషనర్, ఏఈఆర్ఓ డా.ఎస్.వెంకట మణి కరణ్..

- “ఎస్ఐఆర్-2026” ఎన్యుమరేషన్ ఫామ్‌లను వెంటనే సమర్పించండి..!
- ఆలస్యం చేస్తే ఓటు జాబితాలో పేరు కూడా మిస్సయ్యే అవకాశం..!
- 2-3 రోజుల్లోపే సర్ ఫామ్‌ను బిఎల్‌వోలకు అందజేయాలని డిప్యూటీ కమిషనర్ విజ్ఞప్తి..
- సరైన వివరాలతో సమర్పించిన ఫామ్‌లనే పరిగణలోకి తీసుకుని పరిశీలిస్తారు..
- గడువు దాటితే డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు లేనట్టే..
- దుండిగల్ సర్కిల్ ఓటర్లు తప్పనిసరిగా ఫామ్‌లు సమర్పించాలని డీసీ సూచనలు..
- సమాచారం కోసం వెబ్‌సైట్ లింక్: https://voters.eci.gov.in..!
- లేదా Voter Helpline యాప్‌ను వినియోగించాలి..

भारत निर्वाचन आयोग ELECTION COMMISSION OF INDIA

-4లో

## ‘సర్’ కేంద్రాలను సందర్శించిన..! అడిషనల్ కలెక్టర్..



- ఓటర్లకు అవగాహన కల్పించండి..!
- ‘సర్’ ప్రక్రియలో నిర్లక్ష్యానికి తావివ్వొద్దు..!
- బీఎల్‌వోలకు అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి కీలక ఆదేశాలు..
- ‘సర్’ ఫారాల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలని ఆదేశం..
- ఓటర్లకు సందేహాల నివృత్తికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచన..
- ఘట్కేసర్‌లో సర్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్..

-4లో

# కన్నెపల్లి నుంచే రోజూ 2 టీఎంసీలు ఎత్తిపోయొచ్చు

## ఏపీలో పట్టిసీమ వద్ద నీటిని వాడుకుంటుంటే తెలంగాణలో ఎందుకు వాడరు?

### ఇది సీఎం తెచ్చిన కరవు: కేటీఆర్

**హైదరాబాద్ పెన్ పవర్:** మేడిగడ్డతో సంబంధం లేకుండా కన్నెపల్లి పంపుహౌస్ నుంచి రోజూ రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోయవచ్చని భారాస రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. ఆ నీటితో గోదావరి బేసిన్‌లోని ఎస్సారెస్పీ, లోయర్, మిడ్ మానేరు, మల్లన్నసాగర్, బస్వాపూర్ జలాశయాలను నింపి సాగునీటి ఇబ్బందులను తీర్చవచ్చన్నారు. ఈ విషయాన్ని రిటైర్డ్ ఇంజినీర్ల అసోసియేషన్ కూడా స్పష్టం చేసిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్నది కాలం తెచ్చిన కరవు కాదని, భారాసపై కక్షతో రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ... ప్రజలపై రుద్దుతున్న కరవని మండిపడ్డారు. శనివారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో పార్టీ ముఖ్యనేతలతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. “కన్నెపల్లి పంపుహౌస్ వద్ద 96.79 మీటర్లలో నీటి ప్రవాహం ఉంది. ఇక్కడి నుంచి రోజూ 9 టీఎంసీల నీరు వృథాగా పోతోంది. ఈ ఏడాది అక్టోబరు వరకు ఇక్కడి నుంచి ఈ నీటిని ఎత్తిపోసుకోవచ్చు. ఈ ప్రాంతం నుంచే ప్రవహిస్తున్న గోదావరి నీటిని ఆంధ్రప్రదేశ్‌లోని పట్టిసీమ వద్ద అక్కడి ప్రభుత్వం ఎత్తిపోసుకుంటోంది. మరి తెలంగాణ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదు? తన గురువుకు దక్షిణ కింద కన్నెపల్లి వద్ద నీటిని వాడుకోవడం లేదా? భారాసపై కోపముంటే మాపై కేసులు పెట్టండి.. తిట్టండి. లక్షల మంది రైతుల నోట్లో మాత్రం మట్టి కొట్టొద్దు. 2022 జులైలో భయంకరమైన వరద వస్తే కూడా తట్టుకొని మేడిగడ్డ... మేటిగడ్డగా నిలిచింది. భద్రాచలానికి రాష్ట్రంలో ప్రవహిస్తున్న నీటితో ముంపు లేదు. ఏపీలో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు ఎత్తు పెంచడంతోనే ముంపు ఏర్పడుతుంది.

**కాళేశ్వరం గురించి తలా తోక తెలియదు..**

కాళేశ్వరం గురించి రేవంత్‌రెడ్డికి తలా తోక తెలియదు. కన్నెపల్లి వద్ద నీళ్లను ఎత్తిపోసుకోవడానికి అవకాశం ఉన్నా

-5లో




01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
‘ ఐదు రోజులకు ’
‘4 సెం.మీ 4 సెం.మీ’
‘మరిన్ని వివరాలకు సంప్రదించండి ’
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ‘సర్’ ప్రక్రియ వేగవంతం చేయాలి: సీఈవో సుదర్శన్‌రెడ్డి

- కూకట్‌పల్లి వార్డు కార్యాలయం, కేపీహెచ్‌బీ ప్రాంతాల్లో పర్యటన..!
- ఓటర్లతో నేరుగా మాట్లాడి సందేహాలు నివృత్తి చేసిన సుదర్శన్‌రెడ్డి..



- సర్ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, వేగంగా పూర్తి చేయాలని ఆదేశాలు..
- ఫారాల స్వీకరణ అనంతరం వెంటనే డిజిటలైజేషన్ చేయాలని సూచన..!
- అందుబాటులో లేని ఓటర్లను ఫోన్ ద్వారా సంప్రదించాలని బీఎల్‌వోలకు సూచన..
- కొత్త ఓటర్ల నమోదు విధానంపై అధికారులకు మార్గదర్శకాలు..

-5లో

**మేడ్చల్ జిల్లా బ్యూరో/కూకట్‌పల్లి, పెన్ పవర్, జూలై 11:** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.. శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని బాలాజీ నగర్ వార్డు కార్యాలయం, కేపీహెచ్‌బీ 6వ ఫేజ్‌లో జరుగుతున్న సర్ ప్రక్రియను మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి ఆయన పరిశీలించారు.. బీఎల్‌వోలు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, ఓటర్లు సమర్పించిన ఫారాల స్వీకరణ, హెల్ప్‌డెస్క్‌ల నిర్వహణను సీఈవో పరిశీలించారు.. ఓటర్ల నుంచి అందిన ఫారాలను ఆలస్యం చేయకుండా వెంటనే డిజిటలైజేషన్ చేయాలని, ఆ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని అధికారులకు సూచించారు.. అపార్ట్‌మెంట్‌లలో కొనసాగుతున్న ఫారాల పంపిణీ, సేకరణ, అప్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించిన ఆయన, ఓటర్లకు పూర్తి అవగాహన కల్పించి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని బీఎల్‌వోలకు సూచించారు. ఇంటి వద్ద లేని ఓటర్లను ఫోన్ ద్వారా సంప్రదించి వివరాలు సేకరించి ఫారాలు అందజేయాలని, అలాంటి వివరాలను వెంటనే సూపర్‌వైజర్ దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు..




# 'ఎస్ఐఆర్'ను నిర్లక్ష్యం చేస్తే..! మీ 'ఓటు' గల్లంతే..!

దుండిగల్ డిప్యూటీ కమిషనర్/
ఏఈఆర్ఓ డా. ఎస్. వెంకట మణి కరణ్ విజ్ఞప్తి..


దుండిగల్ డిప్యూటీ కమిషనర్, ఏఈఆర్ఓ డా.ఎస్.వెంకట మణి కరణ్..

- "ఎస్ఐఆర్-2026" ఎన్యుమరేషన్ ఫామ్‌లను వెంటనే సమర్పించండి..!
- ఆలస్యం చేస్తే ఓటు జాబితాలో పేరు కూడా మిస్సయ్యే అవకాశం..!
- 2-3 రోజుల్లోపే సర్ ఫామ్‌ను బిఎల్‌వోలకు అందజేయాలని డిప్యూటీ కమిషనర్ విజ్ఞప్తి..
- సరైన వివరాలతో సమర్పించిన ఫామ్‌లనే పరిగణలోకి తీసుకుని పరిశీలిస్తారు..
- గడువు దాటితే డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు లేనట్టే..
- దుండిగల్ సర్కిల్ ఓటర్లు తప్పనిసరిగా ఫామ్‌లు సమర్పించాలని డీసీ సూచనలు..
- సమాచారం కోసం వెబ్‌సైట్ లింక్: https://voters.eci.gov.in..!
- లేదా Voter Helpline యాప్‌ను వినియోగించాలి..

**దుండిగల్, పెన్ పవర్, జూలై 11:** గడువులోగా ఎస్ఐఆర్-2026 ఎన్యుమరేషన్ ఫామ్‌లు ఇవ్వని వారి పేర్లు డ్రాఫ్ట్, ఓటరు జాబితాలో ఉండకపోవచ్చని, దుండిగల్ సర్కిల్-59 డిప్యూటీ కమిషనర్ అండ్ ఏఈఆర్ఓ డా.ఎస్. వెంకట మణికరణ్ ప్రజలకు సూచనలు చేశారు.. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్-2026) కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ పంపిణీ చేసిన ఓటర్ల ఎన్యుమరేషన్ ఫామ్‌లను సకాలంలో సమర్పించాలని దుండిగల్ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఏఈఆర్ఓ) డా.ఎస్. వెంకట మణి కరణ్ దుండిగల్ సర్కిల్ పరిధిలోని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తూ శనివారం పత్రికా ప్రకటన జారీ చేశారు.. ఈ సందర్భంగా పలు సూచనలు సలహాలు చేశారు.. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో భాగంగా బూత్ లెవల్ ఆఫీసర్లు (బిఎల్‌వోలు) ఇప్పటికే ఇంటింటికీ వెళ్లి ప్రతి ఓటరికి ఎన్యుమరేషన్ ఫామ్‌లను పంపిణీ చేసినట్లు తెలిపారు.. ఈ ఫామ్‌లను ప్రతి ఓటరు స్వయంగా పూర్తి వివరాలతో నింపి, అవసరమైన ఆధార పత్రాలను జతచేసి, వచ్చే రెండు నుంచి మూడు రోజుల్లోపు తమ పరిధిలోని సంబంధిత బిఎల్‌వోలకు అందజేయాలని సూచించారు..




## ఫామ్ సమర్పించక పోయినా..! వివరాలు మిస్సైనా..!

సమర్పించిన ఫామ్‌లలోని వివరాలను ఎన్నికల అధికారులు పరిశీలించిన అనంతరం మాత్రమే డ్రాఫ్ట్ ఓటరు జాబితా రూపొందించ బడుతుందని తెలిపారు. గడువులోగా సరైన వివరాలతో ఫామ్‌లను సమర్పించక పోయినా..! వివారలలో స్పష్టత లేకపోయినా..! వారి పేర్లు డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఉండకపోవచ్చని, అందువల్ల ప్రతి ఓటరు ఈ ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని సూచించారు.. దుండిగల్ సర్కిల్ పరిధిలోని ఓటర్లందరూ తమ ఓటు హక్కును కొనసాగించుకునేందుకు ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా, తమకు అందిన ఎన్యుమరేషన్ ఫామ్‌ను వెంటనే పూర్తి చేసి సంబంధిత బిఎల్‌వోలకు అందజేయాలని డా.ఎస్.వెంకట మణి కరణ్ కోరారు..

అదేవిధంగా, తమ పోలింగ్ కేంద్రం, ఓటరు నమోదు, బిఎల్‌వోల వివరాలు, దరఖాస్తుల స్థితి, ఓటరు సేవలకు సంబంధించిన సమాచారం కోసం భారత ఎన్నికల సంఘం అధికారిక "Voters Service Portal" ను ఉపయోగించాలని సూచించారు. ఈ సేవలు https://voters.eci.gov.in, ద్వారా అందుబాటులో ఉంటాయని తెలిపారు. అదేవిధంగా ECI Voter Helpline మొబైల్ యాప్ ద్వారా కూడా ఓటర్లు సంబంధిత సేవలను పొందవచ్చని పేర్కొన్నారు.

---

ఘట్‌కేసర్‌లోని 'సర్' కేంద్రంలో ఎన్యుమరేషన్ ఫారాలు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్..



ఓటర్‌ల వద్ద ఫారాలను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి..



- ఓటర్లకు అవగాహన కల్పించండి..!
- 'సర్' ప్రక్రియలో నిర్లక్ష్యానికి తావివ్వొద్దు..!
- బీఎల్‌వోలకు అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి కీలక ఆదేశాలు..
- 'సర్' ఫారాల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలని ఆదేశం..
- ఓటర్లకు సందేహాల నివృత్తికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచన..
- ఘట్కేసర్‌లో సర్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్..

# 'సర్' కేంద్రాలను సందర్శించిన..! అడిషనల్ కలెక్టర్

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూలై 11:** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాలు పూరించడంలో ఓటర్లకు పూర్తిగా అవగాహన కల్పించడం బీఎల్‌వోల ప్రధాన బాధ్యతని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తెలిపారు.. శనివారం ఘట్కేసర్ మండలంలోని ఎదులాబాద్, ఎన్ఎస్సీ, నగర్‌లో ఏర్పాటు చేసిన ఎన్యుమరేషన్ కేంద్రాలను కీసర ఆర్డీవో వెంకటరెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు.. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎన్యుమరేషన్ ఫారాల స్వీకరణ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు అందిన దరఖాస్తులను వెంటనే డిజిటలైజ్ చేయాలని అధికారులను ఆదేశించారు.. ఫారాలు పూరించడంలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బీఎల్‌వోలు సహకరించాలని, వారి సందేహాలను ఓర్పుతో నివృత్తి చేయాలని సూచించారు.. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ(సర్) పారదర్శకంగా, సమర్థవంతంగా సాగేందుకు ప్రతి బీఎల్‌వో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి స్పష్టం చేశారు.. అర్హత కలిగిన ప్రతి ఓటరు ఎన్యుమరేషన్ ప్రక్రియలో భాగస్వామి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ ఎమ్మార్వో చంద్రశేఖర్, ఏఈఆర్వోలు, బీఎల్‌వోలు తదితర అధికారులు పాల్గొన్నారు..



# 'సర్' ప్రక్రియ వేగవంతం చేయాలి: సీఈవో సుదర్శన్‌రెడ్డి



ఇంటింటికి సర్ ఫారాల పంపిణీలో బీఎల్‌వోల పనితీరుపై సీఈవో, కలెక్టర్ పర్యవేక్షణ..

- కూకట్‌పల్లి వార్డు కార్యాలయం, కేపీహెచ్‌బీ ప్రాంతాల్లో పర్యటన..!
- ఓటర్లతో నేరుగా మాట్లాడి సందేహాలు నివృత్తి చేసిన సుదర్శన్‌రెడ్డి..

- సర్ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, వేగంగా పూర్తి చేయాలని ఆదేశాలు..
- ఫారాల స్వీకరణ అనంతరం వెంటనే డిజిటలైజేషన్ చేయాలని సూచన..!
- అందుబాటులో లేని ఓటర్లను ఫోన్ ద్వారా సంప్రదించాలని బీఎల్‌వోలకు సూచన..
- కొత్త ఓటర్ల నమోదు విధానంపై అధికారులకు మార్గదర్శకాలు..



హెల్ప్‌డెస్క్‌లో పనితీరును పరిశీలిస్తున్న సీఈవో, కలెక్టర్..

**మేడ్చల్ జిల్లా బ్యూరో/కూకట్‌పల్లి, పెన్ పవర్, జూలై 11:** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.. శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని బాలాజీ నగర్ వార్డు కార్యాలయం, కేపీహెచ్‌బీ 6వ ఫేజ్‌లో జరుగుతున్న సర్ ప్రక్రియను మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి ఆయన పరిశీలించారు.. బీఎల్‌వోలు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, ఓటర్లు సమర్పించిన ఫారాల స్వీకరణ, హెల్ప్‌డెస్క్‌ల నిర్వహణను సీఈవో పరిశీలించారు.. ఓటర్ల నుంచి అందిన ఫారాలను ఆలస్యం చేయకుండా వెంటనే డిజిటలైజేషన్ చేయాలని, ఆ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని అధికారులకు సూచించారు.. అపార్ట్‌మెంట్‌లలో కొనసాగుతున్న ఫారాల పంపిణీ, సేకరణ, అప్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించిన ఆయన, ఓటర్లకు పూర్తి అవగాహన కల్పించి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని బీఎల్‌వోలకు సూచించారు. ఇంటి వద్ద లేని ఓటర్లను ఫోన్ ద్వారా సంప్రదించి వివరాలు సేకరించి ఫారాలు అందజేయాలని, అలాంటి వివరాలను వెంటనే సూపర్‌వైజర్ దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు..



సీఈవో సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ మను..

2002 తర్వాత అర్హత పొందిన కొత్త ఓటర్ల ఫారాల పూరించే విధానంపై అధికారులకు మార్గనిర్దేశం చేసిన సీఈవో, అనంతరం కేపీహెచ్‌బీ 6వ ఫేజ్‌లోని అపార్ట్‌మెంట్‌లలో ఓటర్లతో నేరుగా మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఇండో ఫార్చ్యూన్ గ్రేటర్ కమ్యూనిటీలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించి బీఎల్‌వోల పనితీరును పర్యవేక్షించారు..ఈ పర్యటనలో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్, ఎమ్మార్వో అశోక్, డీసీ ఆంజనేయులు, సూపర్‌వైజర్‌లు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లిలో కలెక్టర్ మనుతో, సీఈవో సుదర్శన్‌రెడ్డి సర్ ప్రక్రియ పరిశీలన..

# కన్నెపల్లి నుంచే రోజూ 2 టీఎంసీలు ఎత్తిపోయొచ్చు

-3 పేజి తరువాయి

రాజకీయ ద్వేషంతో కళ్లు మూసుకున్నారు. నీళ్ల కోసం రైతులు ప్రభుత్వాన్ని నిలదీస్తుండటంతో రేవంత్‌రెడ్డికి అసహనం కలుగుతోంది. ఎప్పుడూ స్థిరాస్తి వ్యాపారం.. ఎనుముల అన్నదమ్ముల గురించే కాకుండా రాష్ట్ర ప్రజల గురించి కూడా ఆలోచించాలి. రేవంత్‌రెడ్డిలో అపరిచితుడు దాగి ఉన్నాడు.

**కాంగ్రెస్ పార్టీ ఖాతాలో రూ.3 వేల కోట్లున్నాయి**

ఒకవేళ ఇప్పుడు ఎన్నికలు జరిగితే భారాసకు 78 సీట్లు వస్తాయని రేవంత్‌రెడ్డి చేయించుకున్న అంతర్గత సర్వేలో తేలింది. దమ్ముంటే ఆ సర్వే అబద్ధమని భద్రాద్రి రాముడి సాక్షిగా సీఎం ప్రమాణం చేయాలి. పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు రావాలి. లేకపోతే మొత్తం శాసనసభను రద్దు చేసి ముందస్తు ఎన్నికలకు వెళితే ఏ పార్టీని ప్రజలు ఆదరిస్తారో తెలుస్తుంది. కేసీఆర్ తయారు చేసిన సైనికుడు హరీశ్‌రావు. నాలుగు పార్టీలు మారిన రేవంత్‌రెడ్డి... పార్టీ మారే విషయాలపై ఎంత తక్కువ మాట్లాడితే అంతమంచిది. సీఎం దిల్లీకి పోయి ఉదయం కాంగ్రెస్‌తో, రాత్రికి భాజపాతో కలిసి ఉంటారు. తెలంగాణ ఉద్యమ సమయంలో యువకుల ప్రాణాలు తీసిన కాంగ్రెస్ పార్టీ ఖాతాలో రూ.3 వేల కోట్లు ఉన్నాయి.' అని విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు కేటీఆర్ సమాధానం ఇచ్చారు. సమావేశంలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీమంత్రి ప్రశాంత్‌రెడ్డి, సీనియర్ నేతలు రాజయ్య, నామా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పరామర్శకు వెళ్తున్న భారాస నేతల అరెస్ట్

**షాబాద్ ఘటన ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం: కేటీఆర్**

మహిళల భద్రత విషయంలో వైఫల్యానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. "షాబాద్ ఘటన ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం. పోక్సో నిందితుడికి బెయిల్ ఇప్పించి ఆరుగురి ప్రాణాలు బలిగొనే పరిస్థితిని ప్రభుత్వమే కల్పించింది" అని కేటీఆర్ పేర్కొన్నారు.

**సీఎం రాజీనామా చేయాలి: హరీశ్‌రావు**

రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. షాబాద్‌లో ఆరు హత్యలకు నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండు చేశారు. సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ... బాధితురాలైన దివ్యాంగురాలికి రూ.కోటి ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి సంరక్షణ బాధ్యతలను ప్రభుత్వమే తీసుకోవాలన్నారు.

# అప్పుల్లో ఉన్నా పథకాలు ఆపలేదు: మంత్రి జూపల్లి



**హైదరాబాద్ పెన్ పవర్:** భారాస హయాంలో రాష్ట్రం అప్పులకుప్పగా మారిందని... అయినా నాటి ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని తొలగించకుండా నేటికీ కొనసాగిస్తున్నామని రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. కుమురం భీం జిల్లాలోని ఆసిఫాబాద్, కెరమెరి, వాంకిడి మండలాల్లో కొత్తగా నిర్మించిన పంచాయతీ భవనాలు, మండల మహిళా సమాఖ్య భవనాలను శనివారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్, కలెక్టర్ హరిత, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం జిల్లా కేంద్రంలో 'సర్' కార్యక్రమంపై బీఎల్ఏలకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొని... మాట్లాడారు. సర్ కార్యక్రమం కొత్తది కాకున్నా.. భాజపా కుట్రపూరిత నిబంధనలతో ఓటర్లను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఇతర పనులు పక్కన పెట్టి 'సర్'కు సమయం కేటాయించాలని సూచించారు. పోడు సమస్య పలు జిల్లాల్లో ఉందని, దీనిపై అటవీ అధికారులతో మాట్లాడి రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ వంశీ, కాంగ్రెస్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణలో మినీ సమ్మర్

**హైదరాబాద్, జూలై 11 పెన్ పవర్:** తెలంగాణలో జూలై 15 వరకు రుతుపవనాలు బలహీనపడి బ్రేక్ మాన్‌సూన్ పరిస్థితులు ఏర్పడనున్నాయి. దీనివల్ల రాష్ట్రంలో భారీ వర్షాలు కరువై.. పగటి ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. ముఖ్యంగా జూలై 12-15 మధ్య తూర్పు తెలంగాణలో 37 డిగ్రీల సెల్సియస్ నుంచి 40 డిగ్రీల సెల్సియస్ వరకు హైదరాబాద్‌లో 35 డిగ్రీల సెల్సియస్ నుంచి 37 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని చెప్పారు. దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం వల్ల తూర్పు, ఈశాన్య భారతం మినహా మిగిలిన ప్రాంతాల్లో వర్షపాత లోటు పెరుగుతోందన్నారు.తెలంగాణలో ఈసారి విచిత్ర వాతావరణ పరిస్థితులు ఉన్నాయి. ఫిబ్రవరి మట్నదటి వారం నుంచి ఎండలు దంచకొట్టగా.. జులై నెల సగానికి వచ్చినా సరిపడా వర్షాలు లేవు. రాష్ట్రంలో రాబోయే రోజుల్లో రుతుపవనాలు మరింత బలహీనపడనున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. జూలై 15 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం లేదని చెప్పారు. దానికి తోడు తీవ్రమైన రుతుపవనాల విరామం పరిస్థితులు నెలకొంటాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. జూలై మాసంలో సాధారణంగా భారీ వర్షాలు కురవాల్సి ఉండగా.. ఈసారి వాతావరణం అందుకు భిన్నంగా మారి.. ఒక మినీ సమ్మర్‌ను తలపించేలా ఎండ తీవ్రత పెరగనుంది.ముఖ్యంగా జూలై 12 నుండి 15 మధ్య కాలంలో తెలంగాణలో పగటి ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగనున్నాయి. తూర్పు తెలంగాణ జిల్లాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండి, ఉష్ణోగ్రతలు ఏకంగా 37 డిగ్రీల సెల్సియస్ నుంచి 40 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే ఛాన్సుంది. అలాగే రాజధాని హైదరాబాద్ నగరంలో కూడా పగటి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల సెల్సియస్ నుంచి 37 డిగ్రీల సెల్సియస్ వరకు పెరగవచ్చు. తీవ్రమైన ఉక్కపోత, ఎండల కారణంగా స్థానికంగా అక్కడక్కడ వేడి ప్రభావంతో కురిసే తేలికపాటి వర్షాలు మినహా ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కాకపోవచ్చునని వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు.ప్రస్తుతం దేశ వాతావరణాన్ని 'ఎల్-నినో' తీవ్రంగా ప్రభావితం చేస్తోందన్నారు. దేశంలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు పడుతున్నప్పటికీ, తెలంగాణతో పాటు మరికొన్ని రాష్ట్రాలు తీవ్ర వర్షపాత లోటును ఎదుర్కొంటున్నాయన్నారు. కొంకణ్, మధ్య మహారాష్ట్ర ప్రాంతాల్లో మంచి వర్షాలు కురిసినప్పటికీ, విదర్భ, మరఠ్వాడ వంటి ప్రాంతాలు ఇంకా తీవ్ర వర్షపాత లోటులోనే ఉన్నాయని చెప్పారు. జూలై ద్వితీయార్థంలో ఇక్కడ పరిస్థితులు మరింత క్షీణించవచ్చునని చెప్పారు. రాజస్థాన్, గుజరాత్, పశ్చిమ మధ్యప్రదేశ్, ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో కేవలం రుతుపవనాల ప్రారంభంలో మాత్రమే వర్షాలు పడ్డాయని.. ఆ తర్వాత అక్కడ కూడా పెద్దగా

వర్షాలు లేవని చెప్పారు. మాన్సూన్ ట్రఫ్ ఉత్తర దిశగా విస్తరించడం, అలాగే ఎల్‌నినో అనుకూల వాతావరణ పరిస్థితుల వల్ల కేవలం ఒడిశా, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, ఈశాన్య రాష్ట్రాల్లో మాత్రమే మంచి వర్షాలు కురుస్తున్నాయన్నారు.ప్రస్తుతం భారతదేశం మొత్తం మీద సగటు వర్షపాతం సాధారణం కంటే మైనస్ 14 శాతం లోటుతో నడుస్తోందని చెప్పారు. రుతుపవనాలు బలహీనంగా ఉండటం వల్ల జూలై చివరి నాటికి ఈ లోటు 20 నుండి 25 శాతానికి పెరిగే ప్రమాదం ఉందన్నారు. జూలై రెండో భాగంలో కొన్ని అల్పపీడనాలు ఏర్పడినప్పటికీ.. తెలంగాణకు మాత్రం జూలై చివరి 10 రోజులు మాత్రమే వర్షాలు కురిసే ఛాన్సుందన్నారు. ఒకవేళ ఆ సమయంలో కూడా వర్షాలు కురవకపోతే.. ఇక ఆగస్టు నెలపైనే ఆశలు పెట్టుకోవాల్సి వస్తుందని చెబుతున్నారు.

# ఈటెల వ్యూహం ఏమిటీ

**కరీంనగర్, జూలై 11, పెన్ పవర్:** బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు పార్టీలో చర్చనీయాంశమయ్యాయి. తనకు తెలంగాణ రాష్ట్రం ముఖ్యమని, ఆ తర్వాతే పార్టీ అని, ఆ తర్వాతే వ్యక్తిగతమని ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీలో లోతైన చర్చకు కారణమయింది. ఈటల రాజేందర్ మావోయిస్టుల నుంచి రాజకీయాల్లోకి వచ్చారు. ఆయన తెలంగాణ రాష్ట్ర ఉద్యమం నుంచి బీఆర్ఎస్ లో పనిచేశారు. బీఆర్ఎస్ ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నప్పటికీ ఆయన తనదైన ముద్రను వేసుకున్నారు. బీసీ నేతగా ఉన్న ఈటల రాజేందర్ తొలి నుంచి వివాదాలకు దూరంగా ఉన్నారు. అయితే బీఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ తో పొసగకపోవడంతో పాటు ఆయన వైఖరిని వ్యతిరేకించడంతో పార్టీ నుంచి సస్పెండ్ చేశారు.. దీంతో ఈటల రాజేందర్ ఈటల రాజేందర్ బీజేపీ లో చేరారు. హుజూరాబాద్ లో ఓటమి పాలయినా 2024 ఎన్నికల్లో ఈటల రాజేందర్ మల్కాజ్ గిరి నుంచి బీజేపీ తరుపున పోటీ చేసి ఎన్నికయ్యారు. అయితే సామాజికవర్గం కోటాలతోతనకు మంత్రి పదవి లభిస్తుందని ఆశించారు. కానీ రాకపోవడంతో పాటు తాను గతంలో ప్రాతినిధ్యం వహించిన హుజూరాబాద్ కు మాత్రం ఆయనను దూరం చేయడంతో పాటు పార్టీలో సరైన ప్రాతినిధ్యం కల్పించకపోవడంతో కొంత ఈటల రాజేందర్ ఇబ్బందులు పడుతున్నారని గతంలోనూ ప్రచారం జరిగింది. అయితే తిరిగి బీఆర్ఎస్ లో చేరతారన్న ప్రచారాన్ని డు ఈటల రాజేందర్ కొట్టిపారేశారు. కానీ ఇటీవల ఒక వివాహ వేడుకలో మాజీ మంత్రి కేటీఆర్ ను కలవడం, ఆయన కుటుంబ సభ్యులతో కలసి మాట్లాడటంతో మరొకసారి ఈ ప్రచారం ఊపందుకుంది. కానీ ఈటల రాజేందర్ మాత్రం తాను బీజేపీలోనే కొనసాగుతానని చెబుతున్నారు. కానీ ఆయన ఉన్నట్లుండి తనకు తెలంగాణ ముఖ్యమని ఎందుకన్నారు? పార్టీ తర్వాతేనని అన్న మాటకు అర్థం ఏంటన్న దానిపై కూడా బీజేపీ రాష్ట్ర నేతలు ఆరా తీస్తున్నారు. ఈటల బీజేపీలో ఇమడలేకపోతున్నారన్న చర్చ జోరుగా సాగుతోంది. మొదట తనకు మంత్రిగా అవకాశం వస్తుందనుకున్నారు. ఆ తర్వాత బీజేపీ అధ్యక్ష పదవి దక్కుతుందన్న ప్రచారం జరిగినా, ఎప్పటికప్పుడు చెక్ పెడుతూ వచ్చారు తన వైరి వర్గం నేతలు. ఆ తర్వాత కొంత సైలెంట్ గా ఉన్నా, కాళేశ్వరం విషయంలో ఈటల రాజేందర్ దూకుడుగా మాట్లాడుతున్న తీరు ఇప్పుడు చర్చనీయాంశం అయ్యింది.కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ వద్ద ఉన్న కన్నేపల్లి పంప్ హౌజ్ నుండి వాటర్ లిఫ్టింగ్ పై



కొంతకాలంగా కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. బీజేపీ దాదాపు సైలెంట్ గా ఉన్నా, ఈటల మాత్రం వాయిస్ బీఆర్ఎస్ కు అనుకూలంగా పెంచుతూ వస్తున్నారు. అవినీతి వల్ల మేడిగడ్డ కుంగింది, వాటర్ లిఫ్టింగ్ సాధ్యం కాదని సీఎం రేవంత్, ప్రభుత్వం వాదిస్తుంటే... వాటర్ లిఫ్టింగ్ సాధ్యమేనని బీఆర్ఎస్ వాదిస్తుంది. బీఆర్ఎస్ వాదనను ఎంపీ ఈటల స్ట్రాంగ్ గా సపోర్ట్ చేస్తూ వస్తున్నారు.అవినీతి విషయంలో, అరెస్టుల విషయంలోకి నేను రాను. కానీ కన్నేపల్లి వద్ద ప్రభుత్వం రాజకీయంగా చూస్తూ వాటర్ లిఫ్ట్ చేయటం లేదన్నది ఈటల వాదన. తాను ఎవరో మాట్లాడిస్తే మాట్లాడే వాడిని కాదని, తెలంగాణ మట్టిబిడ్డను, ఉద్యమకారుడిని కాబట్టి అడుగుతున్నా. రైతుల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటానంటూ ఈటల మరోసారి స్పందించారు.ఇటీవల మాజీ ఎంపీ వినోద్ కొడుకు పెళ్లిలో కేటీఆర్ దంపతులతో ఈటల ఉన్న వీడియోలు వైరల్ కావటం, ఇప్పుడు ఉద్యమకారుడిని అంటూ చెప్తూనే కాళేశ్వరం విషయంలో బీఆర్ఎస్ వాదనతో ఏకీభవించటం, బీజేపీలో ఉన్న గ్రూప్ రాజకీయాలను చూస్తుంటే... ఈటల మనసు మారుతోందా? అన్న అనుమానాలు బలపడుతున్నాయని, రాజకీయాల్లో శాశ్వత శత్రువులు-శాశ్వత మిత్రులు ఉండరన్న విషయం మర్చిపోరాదని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.యాధృచ్ఛకంగా అన్న మాటలేనా? లేక ఇందులో ఏదైనా అంతరార్థం ఉందా? అన్న అనుమానాలు కూడా ఉన్నాయి. అయితే ఆయన బీఆర్ఎస్ లో చేరనని చెప్పడంతో బీజేపీలోనే కొనసాగుతూ తన అసంతృప్తిని వెళ్లగక్కే అవకాశముందని కూడా అంటున్నారు. తనను కేవలం ఒక ప్రాంతానికే పరిమితం చేయడంపైన కూడా ఈటల రాజేందర్ గుర్రుగా ఉన్నట్లు సమాచారం. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎంత వరకైనా పోరాడాతానని ఈటల అనడం పైనా కూడా సోషల్ మీడియాలో వివిధ కామెంట్స్ వినపడుతున్నాయి. ఇప్పటికే బండి సంజయ్, కిషన్ రెడ్డిలతో ఈటల రాజేందర్ కు అంత సంబంధాలు మంచిగా లేవని, ఈటల రాజేందర్ ఎందుకు అన్నారన్నది కాలమే నిర్ణయిస్తుందని అంటున్నారు.

# మూడింటిలో రెండు కార్పొరేషన్లపై గురి

**హైదరాబాద్, జూలై 11, పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయాల్లో తదుపరి సమరం హైదరాబాద్ మహానగరం వేదికగా ప్రారంభం కానుంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో కాంగ్రెస్ ప్రభుత్వం పాత 1955 నాటి యాక్ట్‌ను రద్దు చేసి పాత గ్రేటర్‌ను మూడు స్వతంత్ర కార్పొరేషన్లుగా విభజించి, డివిజన్ల సంఖ్యను 150 నుండి ఏకంగా 300 కి పెంచి ఎన్నికలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేస్తోంది. కాంగ్రెస్ వేస్తున్న ఈ త్రిశూల వ్యూహాన్ని తిప్పికొట్టి, హైదరాబాద్‌పై ఎలాగైనా జెండా ఎగరేయడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ హైకమాండ్ తన వ్యూహాలకు పదును పెట్టింది.ఇందులో భాగంగానే ఇటీవల బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అత్యంత యువ లీడర్ నితిన్ నవీన్ హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు సుదీర్ఘంగా పర్యటించి, రాష్ట్ర కోర్ కమిటీ నేతలకు గట్టి వార్నింగ్ , దిశానిర్దేశం చేసి వెళ్లారు. నితిన్ నవీన్ తన అంతర్గత సమావేశాల్లో రాష్ట్ర నేతలకు అత్యంత స్పష్టమైన సందేశాన్ని ఇచ్చారు. పట్టణ ప్రాంతాలు, ముఖ్యంగా హైదరాబాద్ వంటి కాస్మోపాలిటన్ సిటీలు ఎప్పుడూ బీజేపీకి బలమైన కోటలు. లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ చుట్టుపక్కల ఎంపీ స్థానాలు గెలిచినంత మాత్రాన సరిపోదు.. ఈ మూడు కార్పొరేషన్ల ఎన్నికల్లో మన సత్తా చాటకపోతే, తెలంగాణలో అధికారం చేపడతామనే బీజేపీ కల భవిష్యత్తులో కేవలం కలగానే మిగిలిపోతుంది అని ఆయన కుండబద్దలు కొట్టారు. నేతల మధ్య ఉన్న అంతర్గత విభేదాలను పక్కనబెట్టి, కలిసికట్టుగా పోరాడకపోతే జరిగే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. గ్రేటర్‌ను విభజించడం వెనుక కాంగ్రెస్ పొలిటికల్ స్కెచ్ ఉంది. ఓల్డ్ సిటీ పరిధిలోని హైదరాబాద్ , ఐటీ కారిడార్ ఉన్న సైబరాబాద్ , ఉద్యోగులు-మధ్యతరగతి ఎక్కువగా ఉండే మల్కాజ్‌గిరి .. ఈ మూడింటికీ వేర్వేరు వ్యూహాలు కావాలని నితిన్ నవీన్ స్పష్టం చేశారు. రాష్ట్ర బీజేపీ నేతలకు ఇవి కేవలం మున్సిపల్ ఎన్నికలు కావు.. వారి సొంత రాజకీయ భవిష్యత్తును, ఉనికిని చాటుకోవడానికి ఒక అగ్నిపరీక్ష. అందుకే జాతీయ అధ్యక్షుడి పర్యటన ముగిసిన వెంటనే తెలంగాణ బీజేపీ నేతలంతా గ్రేటర్ మున్సిపల్ పరిధిపై అంతర్గత కసరత్తు తీవ్రం చేశారు. గత 2020 జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ ఏకంగా 48 స్థానాలు గెలుచుకుని బీఆర్ఎస్ గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. ఇప్పుడు బీఆర్ఎస్ బాగా బలహీనపడిన తరుణంలో.. ఆ ఓటు బ్యాంక్ కాంగ్రెస్ వైపు వెళ్లకుండా పూర్తిగా తమ వైపు తిప్పుకోవడమే బీజేపీ ముందున్న అసలైన టాస్క్.కొత్తగా ఏర్పడిన సైబరాబాద్ , మల్కాజ్‌గిరి కార్పొరేషన్ల పరిధిలో ఐటీ ఉద్యోగులు, వలస ప్రజలు, ఇతర రాష్ట్రాల ఓటర్లు అత్యధికంగా ఉన్నారు. ఈ సెగ్మెంట్ సాంప్రదాయకంగా ప్రధాని మోదీ నాయకత్వాన్ని ఇష్టపడుతుంది కాబట్టి, ఇక్కడ క్షేత్రస్థాయిలో సరైన అభ్యర్థులను నిలబెడితే మేజర్‌గా లాభపడొచ్చని బీజేపీ భావిస్తోంది. ఇటు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సంక్షేమ పథకాలు, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు బూచీని చూపిస్తూ గ్రేటర్ ఓటర్లను ఆకట్టుకోవాలని చూస్తోంది. ఈ తరుణంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ, మూడు కార్పొరేషన్ల పరిధిలోని 300 డివిజన్లలోనూ బూత్ స్థాయి కమిటీలను పటిష్టం చేసే పనిలో బీజేపీ శ్రేణులు నిమగ్నమయ్యాయి.ఈ త్రిముఖ కార్పొరేషన్ పోరు తెలంగాణ భవిష్యత్తు రాజకీయ గమనాన్ని మార్చనుంది. కాంగ్రెస్ అధికార బలాన్ని, వ్యూహాలను తట్టుకుని నిలబడాలంటే బీజేపీ కేవలం సోషల్ మీడియా పాలిటిక్స్ నమ్ముకుంటే సరిపోదు.. క్షేత్రస్థాయిలో రోడ్ల పైకి వచ్చి పోరాడాల్సి ఉంటుంది. జాతీయ నాయకత్వం పంపిన అల్టిమేటంతో అప్రమత్తమైన తెలంగాణ బీజేపీ లీడర్లు.. ఈ ఎన్నికలను జీవన్మరణ సమస్యగా భావించి సరికొత్త కార్యాచరణతో ముందుకు కదులుతున్నారు. ఒకవేళ ఈ మూడు స్థానాల్లో బీజేపీ మెజారిటీ సాధిస్తే.. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం తామేనని నిరూపించుకునే గోల్డెన్ ఛాన్స్ దక్కుతుందని పొలిటికల్ ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు.

# సిటీలో వాకర్స్ కు కష్టమే...

**హైదరాబాద్, జూలై 11 పెన్ పవర్:** మన దేశంలో చాలా వరకు ఫుట్ పాత్ లు ఆక్రమణకు గురై ఉంటాయి. ఈ నేపథ్యంలోప్రధాన నగరాల్లో పాదచారులకు అనుకూలమైన ఫుట్‌పాత్ లు ఎక్కడెక్కడ ఉన్నాయో 'స్టేట్ ఆఫ్ ఇండియన్ స్ట్రీట్స్ 2026' ఓ నివేదిక ను విడుదల చేసింది. పాదచారులకు సురక్షితంగా, సౌకర్యవంతంగా నడిచే ఫుట్‌పాత్‌లు ఎంత మేర అందుబాటులో ఉన్నాయనే అంశంపై ఈ అధ్యయనం నిర్వహించారు. ఈ అధ్యయనం ప్రకారం దేశంలో అనుకూలమైన ఫుట్‌పాత్ లు ఈ నగరంలో ఉన్నాయో చూద్దాం..స్టేట్ ఆఫ్ ఇండియన్ స్ట్రీట్స్ ప్రకారం..ఫుట్‌పాత్ ల నిర్వహణ దేశంలోని ఎంపిక చేసిన నగరాల్లో పాదచారులకు అనువైన ఫుట్‌పాత్‌ల శాతంలక్నో 28%, బెంగళూరు 25.9%,హైదరాబాద్ 15.1%, చెన్నై 13.9%, ముంబై, 5.5% గా ఉన్నాయి. ఇతర నగరాలతో పోలిస్తే లక్నోలో పాదచారుల కోసం మెరుగైన మౌలిక సదుపాయాలు ఉండటం వల్ల మొదటి స్థానంలో నిలిచింది. నగర ప్రణాళికలో పాదచారుల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వడం ఈ విజయానికి ప్రధాన కారణంగా పేర్కొన్నారు.ఐటీ హబ్‌గా పేరొందిన బెంగళూరు 25.9 శాతం ఫుట్‌పాత్‌లతో రెండో స్థానంలో నిలిచింది. తెలంగాణ రాజధాని హైదరాబాద్ 15.1 శాతంతో మూడో స్థానాన్ని దక్కించుకుంది. నగరంలో కొన్ని ప్రధాన రహదారులపై ఆధునిక ఫుట్‌పాత్‌లు అభివృద్ధి చేసినప్పటికీ, ఇంకా విస్తృత స్థాయిలో మెరుగుదల అవసరమని నివేదిక సూచించింది.చెన్నై 13.9 శాతంతో నాలుగో స్థానంలో ఉండగా, దేశ ఆర్థిక రాజధాని ముంబై కేవలం 5.5 శాతంతో చివరి స్థానానికి పరిమితమైంది. అధిక జనసాంద్రత, రహదారులపై ఆక్రమణలు, పరిమిత స్థలం వంటి కారణాల వల్ల ముంబైలో పాదచారులకు అనువైన ఫుట్‌పాత్‌లు చాలా తక్కువగా ఉన్నట్లు అధ్యయనం పేర్కొంది.భారత నగరాల్లో ఎక్కువ మంది రోజూ నడిచి ప్రయాణాలు చేస్తున్నప్పటికీ, వారికి తగిన ఫుట్‌పాత్‌లు లేకపోవడం వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆక్రమణలు, పార్కింగ్, నిర్మాణ పనులు, అసమానమైన ఫుట్‌పాత్‌లు పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని నివేదిక వెల్లడించింది.

**నివేదిక సూచించిన మార్గదర్శకాలు**

పాదచారులకు అనుకూలమైన నగరాల అభివృద్ధి కోసం అన్ని నగరాల్లో వెడల్పైన, నిరంతరాయంగా కొనసాగే ఫుట్‌పాత్‌లు, దివ్యాంగులకు అనువైన ర్యాంపులు, జీబ్రా క్రాసింగ్‌లు, సురక్షిత రోడ్డు దాటే సౌకర్యాలు, మెరుగైన వీధి లైటింగ్ వంటి మౌలిక సదుపాయాలను పెంచాల్సిన అవసరం ఉందని 'స్టేట్ ఆఫ్ ఇండియన్ స్ట్రీట్స్ 2026' నివేదిక స్పష్టం చేసింది. పాదచారుల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడే నగరాలు నిజమైన అర్థంలో ప్రజలకు అనుకూలంగా మారతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# కేసీఆర్ కు ఏమైంది..

**హైదరాబాద్, జూలై 11, పెన్ పవర్:** తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లయింది. తెలంగాణను సాధించి.. రాష్ట్రాన్ని తొమ్మిదిన్నరేళ్లు పాలించిన కేసీఆర్‌ను కొట్టడం ఎవరికీ సాధ్యం కాదనుకున్నారు. కేసీఆర్, కేటీఆర్ కూడా బీజేపీపై ఫోకస్ పెట్టారు. కానీ రేవంత్‌రెడ్డి బాహుబలిలా షాక్ ఇచ్చాడు. బలమైన కేసీఆర్‌ను ఒంటిచేత్తో ఓడించాడు. రెండున్నరేళ్లుగా కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. ఇలాంటి పరిస్థితిలో కేజీఆర్ రాజకీయ జోష్యాలు చెబుతూ మళ్లీ వచ్చేది బీఆర్ఎస ప్రభుత్వమే.. ముఖ్యమంత్రి అయ్యేది కేసీఆరే అంటూ చెప్పుకుంటున్నారు. ఇవి తెలంగాణ రాజకీయ వాతావరణాన్ని సంక్లిష్టంగా మారుస్తున్నాయి.రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు ఏమీ చేయలేదని, తెలంగాణ ప్రజలు సీఎం రేవంత్, మాజీ సీఎం కేసీఆర్ పాలనను పోల్చి చూసుకుంటున్నారని పేర్కొంటున్నారు. మళ్లీ కేసీఆర్ సీఎం కావాలని కోరుకుంటున్నారని చెబుతున్నారు. కేసీఆర్ చేసిన అభివృద్ధిలో రేవంత్ సగం కూడా చేయలేదని ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ వైఫల్యాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయన్న ధీమా కేటీఆర్‌లో కనిపిస్తుంది. కానీ, రెండున్నరేళుల ఫామ్‌హౌస్‌కు పరిమితమైన కేసీఆర్.. రాజకీయాల్లో మళ్లీ యాక్టివ్ అయ్యే పరిస్థితిపై సందిగ్ధం నెలకొంది. కేసీఆర్‌ను ఇక శాశ్వతంగా ఫామ్‌హౌస్‌కే పరిమితం చేస్తామని రేవంత్ అంటున్నారు.ఎన్నికలు కేవలం ప్రత్యర్థి అనుభవ లోపాలపై ఆధారపడి జరుగవు. నాయకత్వం, కమ్యూనికేషన్, స్థానిక శ్రేణులలోని శక్తి సమీకరణం, సందర్భోచిత సంఘటనలు కూడా ఫలితాన్ని నిర్ణయిస్తాయి. కాబట్టి కాంగ్రెస్ విఫలమైందనే కారణంతో బీఆర్ఎస్ నిర్బంధ విజయమనే జోస్యం తాత్కాలికమే. కేసీఆర్ కూతురు పార్టీ నుంచి బయటకు వచ్చి ధైర్యంగా రాజకీయాలు చేస్తున్నారు. కేటీఆర్ మాత్రం ఇప్పటికీ తండ్రి పేరు చెప్పుకుంటున్నారు. కేసీఆరే కాబోయే ముఖ్యమంత్రి అంటున్నారు. తనను తాను సీఎంగా ప్రొజెక్టు చేసుకోలేకపోతున్నారు.బీఆర్ఎస్‌కి పెద్ద పట్టు ఉన్నా, కుటుంబ రాజకీయాలకు సంబంధించిన అనుబంధ, అంతర్గత విభాగాల ఒత్తిళ్లు, కవిత వంటి నాయకత్వ కొత్త అంశాలు పార్టీకి కొత్త సవాళ్లు తీసుకురావచ్చు. ఒక పార్టీకి నిరంతరంగా అధికారంలో ఉండటానికి సమర్థ నాయకత్వానికి తోటి స్థాయి వ్యూహపరమైన నవీనత, యువ శ్రేణుల ఆకర్షణ, పాలనా ప్రదర్శనలో నిరంతర ఉత్తేజం అవసరం. బహుశా ప్రస్తుతం బీఆర్ఎస్ కీలకంగా కనిపించినా, గెలుపు హామీ సులభంగా చెప్పలేం.తెలంగాణలో బీజేపీ ప్రభావం కూడా పెరిగింది. కేంద్ర స్థాయి మద్దతు, వనరుల వినియోగం, స్థానిక మద్దతుదారుల ఆకర్షణ వ్యూహాలు చివరికి స్థానిక బలహీనతలను ఉపయోగించవచ్చు. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే అంటోంది. బెంగాల్ తర్వాత తెలంణపై ఫోకస్ పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సమయంలో బీఆర్ఎస్ కాంగ్రెస్ వైఫల్యాలను నమ్ముకోవడం కుక్క తోక పట్టుకుని గోదావరి ఈదినట్లే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.తెలంగాణ రాజకీయ స్థితి ఒకే పరీక్ష పెడుతున్న సమయం. ఈ సమయంలో పార్టీని, క్యాడర్‌ను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతిపక్ష నాయకులపై ఉంది. మరో ఏడాది గడిస్తే ఎన్నికల మూడ్ వస్తుంది ఆలోగా బలోపేతం కాకుంటే భవిష్యత్ ప్రశ్నార్థకమవుతుంది.

## ఇంటి సమస్యను అధిగమించేది ఎలా....

# కేటిఆర్, కవితకు సేమ్...సీన్

**హైదరాబాద్, జూలై 11, పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో గులాబీ గూటి పంచాయితీ ఇప్పుడు ఊహించని మలుపు తిరిగింది. నిన్నమొన్నటి వరకు కేవలం అంతర్గత విభేదాలుగా భావించిన వ్యవహారం, ఇప్పుడు ఏకంగా పార్టీ మూలాలనే కదిలించే స్థాయికి చేరింది. సొంతంగా 'తెలంగాణ రక్షణ సేన' పార్టీ పెట్టుకున్న కల్వకుంట్ల కవిత, ఇప్పుడు దీ=ూ అగ్ర నాయకత్వంపై, ముఖ్యంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లక్ష్యంగా చేస్తున్న ఆరోపణలు రాజకీయ గీతల్ని దాటిపోతున్నాయి. నిన్నటి వరకు రాజకీయ విమర్శలకే పరిమితమైన కవిత.. ఈసారి నేరుగా బీఆర్ఎస్ బ్యాంక్ అకౌంట్లలో ఉన్న పార్టీ ఫండ్, క్విడ్ ప్రో కో వ్యవహారాలను వీధిలోకి లాగడం తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. బీఆర్ఎస్ ను బద్నాం చేయడంలో ఇప్పుడు ప్రత్యర్థి పార్టీలకంటే కవిత పాత్రే ఎక్కువగా కనిపిస్తుండటం గమనార్హం.బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల అధికార కాలంలో కూడబెట్టిన 1400 కోట్ల నిధులపై కవిత చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టిస్తున్నాయి. తెలంగాణ ప్రజల సొమ్మును గత ప్రభుత్వ హయాంలో ఆంధ్రా కాంట్రాక్టర్లకు దోచిపెట్టారని, దానికి ప్రతిఫలంగా ఆ కాంట్రాక్టర్ల నుండి భారీగా కమిషన్లు వసూలు చేసి బీఆర్ఎస్ పార్టీ ఫండ్‌గా మార్చారని ఆమె నేరుగానే ఆరోపిస్తున్నారు. సొంత పార్టీ అధినాయకత్వంపైనే, అది కూడా క్విడ్ ప్రో కో కోణంలో ఇంత పెద్ద ఎత్తున ఆర్థిక మూలాలపై దాడి చేయడం సాధారణ విషయం కాదు. గతంలో కేసీఆర్ అవినీతి రహిత పాలన అందించారని చెప్పుకునే గులాబీ శ్రేణులకు ఇప్పుడు ఈ ఆరోపణలు మింగుడుపడటం లేదు.గతంలో బీఆర్ఎస్ పార్టీ జాతీయ రాజకీయాల్లోకి వెళ్లేందుకు ఒక సొంత విమానాన్ని కొనుగోలు చేసిందనే ప్రచారం విస్తృతంగా సాగింది. ఆ వివాదం అలా ఉంచితే, తాజాగా జాతీయ ఆంగ్ల దినపత్రిక 'ది పయనీర్' ను కూడా పార్టీ నిధులతోనే కొనుగోలు చేశారంటూ కవిత సరికొత్త బాంబు పేల్చారు. తనను పార్టీ నుంచి వెళ్లిపోయేలా చేసి.. వందల కోట్ల పార్టీ ధనాన్ని వాడుకుంటూ కేటీఆర్ తన సొంత సామ్రాజ్యాన్ని నిర్మించుకుంటున్నారని, మీడియా సంస్థలను చేతుల్లోకి తీసుకుని బలపడుతున్నారనే ఆవేదన, ఆగ్రహం కవిత మాటల్లో స్పష్టంగా కనిపిస్తోంది.పార్టీలో తనకు ప్రాధాన్యత లేకపోవడంతో కవిత 'తెలంగాణ రక్షణ సేన' అని పేరుతో పార్టీ పెట్టుకున్నారు. కానీ కేటీఆర్ ఆ పేరు రాకుండా పెద్ద ఎత్తున లాబీయింగ్ చేశారని కవిత నమ్ముతున్నారు. తెలంగాణ సెంటిమెంట్ బలాన్ని తాను పొందేందుకు, గ్రౌండ్ లెవెల్‌లో క్యాడర్‌ను సమీకరించుకునేందుకు తాను కొత్తగా టీఆర్ఎస్ పేరుతో పొలిటికల్ ప్లాట్‌ఫారమ్‌ను పునరుద్ధరించాలని చేస్తున్న ప్రయత్నాలను కేటీఆర్ తీవ్రంగా అడ్డుకున్నట్లు తెలుస్తోంది. పార్టీ పేరును తానే రిజిస్టర్ చేయించుకుని కవితకు చెక్ పెట్టాలని కేటీఆర్ చూడటంతో ఆమెలో అసహనం కట్టలు తెంచుకుంది. అటు సెంటిమెంట్ పేరు దక్కకపోవడంతో.. నైతికంగా దెబ్బకొట్టే ప్రయత్నం చేస్తున్నారు.రాజకీయాల్లో ప్రత్యర్థులు చేసే ఆరోపణలకు, సొంత కుటుంబ సభ్యులు.. అదీ మాజీ ముఖ్యమంత్రి కూతురు చేసే ఆరోపణలకు చాలా వ్యత్యాసం ఉంటుంది. ప్రతిపక్షాలు ఎంత మొత్తుకున్నా రాని మైలేజ్, ఇప్పుడు కవిత చేసిన వ్యాఖ్యల ద్వారా బీఆర్ఎస్ వ్యతిరేక పార్టీలకు సులువుగా దొరికింది. బీఆర్ఎస్ పార్టీని, కేసీఆర్ కుటుంబాన్ని టార్గెట్ చేయడానికి ఇంతకంటే బలమైన అస్త్రం ప్రత్యర్థులకు దొరకదు. కవిత చేసిన ఈ క్విడ్ ప్రో కో, 1400 కోట్ల కమిషన్ల ఆరోపణలు బీఆర్ఎస్ పార్టీని నైతికంగా కోలుకోలేని దెబ్బతీసే అవకాశం ఉంది.

# మీడియాకు దూరంగా మోదీ..
# న్యూజిలాండ్ జర్నలిస్ట్ ప్రశ్నపై హాట్ డిబేట్

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రధాని నరేంద్ర మోదీ న్యూజిలాండ్ పర్యటనలో ఎదురైన ఆసక్తికర ప్రశ్న అంతర్జాతీయస్థాయిలో విస్తృత చర్చనీయాంశంగా మారింది. ప్రపంచంలో అత్యంత ప్రభావవంతమైన నేతల్లో ఒకరిగా గుర్తింపు తెచ్చుకున్న ప్రధాని మోదీ అంతర్జాతీయ వేదికలపై మీడియాతో ఎందుకు మాట్లాడరని న్యూజిలాండ్ జర్నలిస్ట్ వేసిన ప్రశ్నకు భారత విదేశాంగ శాఖ అధికారి రుద్రేంద్ర టాండన్ స్పందించిన తీరు హాట్ టాపిక్ అవుతోంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాయకులకు, మీడియాకు మధ్య ఉండాల్సిన బాధ్యతాయుతమైన సంబంధంపై ఈ ప్రశ్న మరోసారి చర్చను రేకెత్తించిందని అంటున్నారు.న్యూజిలాండ్‌లో భారత దౌత్యవేత్తలతో జరిగిన ముఖాముఖి సమావేశంలో, అక్కడి జర్నలిస్ట్ ప్రధాని మోడీని ఉద్దేశించి "ప్రధాని మీడియా సమావేశాలు ఎందుకు నిర్వహించరు?" అని సూటిగా ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు భారత విదేశాంగ శాఖ సీనియర్ అధికారి రుద్రేంద్ర టాండన్ దౌత్యపరంగా స్పందించారు. ఒక ప్రభుత్వ అధికారిగా ప్రధాని వ్యక్తిగత రాజకీయ శైలిపై వ్యాఖ్యానించడం సముచితం కాదని పేర్కొంటూనే, భారత రాజకీయాల్లోని మారుతున్న పోకడలను ఆయన వివరించారు. మధ్యవర్తులైన మీడియా కంటే నేరుగా ఓటర్లతో సంభాషించుకోవడానికే తమ ప్రధాని మోడీ మొగ్గు చూపుతారని ఆయన పేర్కొన్నారు.ఈ ప్రత్యక్ష ప్రజా సంబంధాల కళలో మోడీ అత్యంత నైపుణ్యం సాధించారని, ప్రజలతో ఆయనకున్న ఈ బలమైన అనుబంధమే వరుసగా మూడోసారి అధికారంలోకి రావడానికి మార్గం సుగమం చేసిందని టాండన్ విశ్లేషించారు. వాస్తవానికి, ఆధునిక రాజకీయాల్లో డిజిటల్ మాధ్యమాలు, సోషల్ మీడియా పెరిగిన తర్వాత సంప్రదాయ మీడియా సమావేశాల పాత్ర మారుతోందనేది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. ఒక నాయకుడు నేరుగా ప్రజలతో మమేకం అయినప్పుడు, సమాచారం వేగంగా ప్రజలకు చేరుతుందని, మోడీ వ్యూహం అదేనని వారు భావిస్తున్నారు.కాగా, ప్రధాని మోదీ న్యూజిలాండ్ పర్యటన చారిత్రాత్మక మైలురాయిగా అభివర్ణిస్తున్నారు. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత ఒక భారత ప్రధాని న్యూజిలాండ్‌లో పర్యటించడం అక్కడి భారతీయ ప్రవాసులలో ఉత్సాహాన్ని నింపింది. ఈ పర్యటన గౌరవార్థం ఆక్లాండ్‌లోని ప్రసిద్ధ 'స్కై టవర్'ను భారత త్రివర్ణ పతాక రంగులతో అలంకరించడం విశేషం. ఈ ఏడాది ప్రారంభంలో ఇరు దేశాల మధ్య కుదిరిన ఉచిత వాణిజ్య ఒప్పందం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో, ఈ పర్యటన ఆర్థిక, దౌత్యపరంగా ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుందని అంటున్నారు.మరోవైపు ప్రధాని మోదీ మీడియా సమావేశాలకు దూరంగా ఉంటారనే విమర్శ గతంలోనూ విదేశీ మీడియాలో వినిపించింది. గత మే నెలలో నార్వే పర్యటనలో కూడా హెల్లే లింగ్ అనే జర్నలిస్ట్ ఇదే తరహా ప్రశ్నను అడగగా, అప్పుడు ప్రధాని ఎటువంటి స్పందన ఇవ్వకుండా ముందుకు సాగిపోయారు. ప్రజాస్వామ్యంలో పాలకుడు మీడియాకు జవాబుదారీగా ఉండాలని అంతర్జాతీయ మీడియా వాదిస్తుంటే, ప్రజలతో నేరుగా కనెక్ట్ అవ్వడమే ఆధునిక కాలపు సక్సెస్ ఫార్ములా అని ప్రధాని మోదీ అభిమానులు సమర్థిస్తున్నారు.

### తిరుపతి జిల్లా జిల్లాలో డ్రగ్స్ కలకలం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో డ్రగ్స్ కలకలం రేపాయి. డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురు ముఠా సభ్యులను రేణిగుంట పోలీసులు అరెస్ట్ చేసారు. నిందితుల్లో ఒకరు బి.టెక్ విద్యార్థి. తిరుపతి జిల్లాలో కాలేజీ విద్యార్థులకు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు పోలీసులు విచారణలో గుర్తించారు. రూ.3 లక్షలు విలువైన 62 గ్రాములు ..మీనపీూ (మెత్) డ్రగ్ స్వాధీనం చేసుకున్నారు. రెండు 2 రాయల్ ఎన్ఫీల్డ్ వాహనాలు, 4 సెల్ ఫోన్స్ , 2 డిజిటల్ వేయింగ్ మెషిన్లు స్వాధీనం చేసుకున్నారుజ చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో కాలేజీ విద్యార్థులకు విక్రయాలు జరుపుతున్నారు. తెల్ల గుణశేఖర్,శెట్టిపల్లి గ్రామం, ఎస్. అశ్విన్ కుమార్,కొర్లగుంట, తిరుపతి. పడమల రాహుల్ యాదవ్,, కొర్లగుంట, తిరుపతిలను అరెస్ట్ చేసినట్లు రేణిగుంట డీఎస్పీ శ్రీనివాస్ వెల్లడించారు.

## ప్రారంభానికి ముందే కుప్పకూలింది

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉత్తర భారతంలో నాసిరకం పనుల కారణంగా రోడ్లు దెబ్బతింటున్న ఘటనలు ఇటీవల పెరిగిపోతున్నాయి. కొన్ని చోట్ల ప్రారంభానికి ముందే రోడ్లు కుంగిపోతున్నాయి. తాజాగా ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్లను కలిపే మీరట్-కోట్ద్వార్ నేషనల్ హైవే నిర్మాణం పూర్తి కాకముందే, చిన్న వర్షానికే ఒక వైపు సేఫ్టీ వాల్ మొత్తం కూలిపోయింది. ఇలాంటి నాసిరకం పనులపై కాంట్రాక్టర్లు, అధికారులపై నెటిజన్లు తీవ్రంగా మండిపడుతున్నారు.

## కష్ణానదికి చేరని గోదావరి నీళ్లు

**హైదరాబాద్ పెన్ పవర్:** పోలవరం ప్రాజెక్టు దిగువన ఉన్న పట్టిసీమ మోటార్ల ద్వారా పంప్ చేసిన గోదావరి జలాలు శనివారం ఉదయానికి కృష్ణానదికి చేరుకున్నాయి. 20 మోటార్ల ద్వారా రోజుకు 7 వేల క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఇప్పటివరకు 1.33 టీఎంసీల జలాలను పోలవరం కుడికాలువకు మళ్లించారు. ప్రస్తుతం పోలవరం స్పిల్ వే నుంచి 1.07 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు ప్రవహిస్తోంది.

### తిరుమల మెట్ల మార్గంలో మరోసారి చిరుత కలకలం

**హైదరాబాద్ పెన్ పవర్:** తిరుమల మెట్ల మార్గంలో చిరుత సంచారం మరోసారి కలకలం రేఇంది. చిరుత తిరుగుతుందని భయంతో భక్తులు పరుగులు తీసారు. తిరుమల అలిపిరి నడకమార్గంలోని శ్రీ నరసింహస్వామి ఆలయ సమీపంలో శుక్రవారం రాత్రి భక్తులకు చిరుతపులి కనిపించింది. భక్తులు పరుగులు తీయడంతో అప్రమత్తమైన టీటీడీ భద్రతా, అటవీశాఖ సిబ్బంది భక్తులను సురక్షితంగా తరలించారు.

## రంగారెడ్డిలో దారుణం

**హైదరాబాద్, జూలై 11 పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. రాజ్ కుమార్ అనే వ్యక్తి ఆరుగురిని కత్తితోపొడిచి దారుణంగా హత్య చేశాడు. భార్య, ఇద్దరు పిల్లలతో పాటు మరో ముగ్గురిని హత్య చేశాడు. పోక్సో కేసు పెట్టారన్న కక్షతో నిందితుడు ఈ హత్యకు పాల్పడ్డాడు. మే 16వ తేదీన బాధితురాలి తల్లి కేసు పెట్టారు. ఈ నేపథ్యంలో 28 సంవత్సరాల వయస్సున్న రాజ్ కుమార్ బెయిల్‌పై తిరిగొచ్చి కక్షతో బాధిత బాలిక, బాలిక తల్లి, నానమ్మ, నిందితుడి భార్య సరిత, మూడేళ్ల కుమార్తె, రెండేళ్ల కుమారుడు హత్యకు గురైనట్లు పోలీసులు తెలిపారు.జిల్లాలోని షాబాద్ మండలం దైవాలగూడలో ఈ ఘటన చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న సీపీ తరుణ్ జోషి, డీసీపీ యోగేష్ గౌతమ్‌లు ఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.ఇదిలా ఉండగా, ఆరుగురిని హత్యచేసి నిందితుడు పరారయ్యాడు. అలాగే ఆరుగురిని హత్య చేశానని, తాను కూడా ఆత్మహత్యచేసుకుంటానని తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పినట్లు తెలుస్తోంది. నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు.

### స్ట్రాటజీ సర్వే వర్కౌట్ అవుతుందా...

**హైదరాబాద్, జూలై 11 , పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాలు వ్యూహ ప్రతివ్యూహాలతో రసవత్తరంగా సాగుతున్నాయి. తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సరికొత్త దుమారాన్ని లేపాయి. తెలంగాణలో అధికార కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందని, ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ఏకంగా 78 సీట్లు గెలుచుకుని మళ్లీ అధికారంలోకి వస్తుందంటూ ఆయన చేసిన కామెంట్స్ పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారాయి.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా చేయించుకున్న అంతర్గత సర్వేల్లోనే కాంగ్రెస్ ఓడిపోతుందని తేలిందని కేటీఆర్ బాంబు పేల్చారు. కేవలం పార్టీ సర్వేలే కాకుండా, రెండు ప్రముఖ మీడియా సంస్థల సర్వేలు, అటు కేంద్ర, ఇటు రాష్ట్ర ప్రభుత్వాల ఇంటెలిజెన్స్ వర్గాలు సేకరించిన నివేదికల్లోనూ బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ వస్తుందని తేలిందని ఆయన నొక్కి చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కాస్త డీలా పడ్డ గులాబీ శ్రేణుల్లో కేటీఆర్ ప్రకటన సరికొత్త జోష్ నింపిందనే చెప్పాలి.కేటీఆర్ సర్వేల రాజకీయంపై కాంగ్రెస్ శ్రేణులు అంతే తీవ్రంగా స్పందించాయి. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతలకు ఇలాంటి సొల్లు కబుర్లు చెప్పడం, పగటి కలలు కనడం అలవాటేనంటూ కాంగ్రెస్ నాయకులు ఎద్దేవా చేస్తున్నారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా ప్రతి మూడు నెలలకోసారి సర్వేలు చేయించుకుని, 'మళ్లీ మనదే అధికారం, మనకు తిరుగులేదు' అంటూ చంకలు గుద్దుకునేవారని, ఇప్పుడు కొడుకు కేటీఆర్ కూడా అదే అలవాటును కొనసాగిస్తున్నారని విమర్శిస్తున్నారు.తాము బీఆర్ఎస్ నాయకుల్లాగా కేవలం కాగితాలపై ఉండే సర్వేలను నమ్ముకుని రాజకీయం చేయమని, క్షేత్రస్థాయిలో ప్రజల కోసం పనిచేస్తామని కాంగ్రెస్ స్పష్టం చేస్తోంది. అధికారంలోకి వచ్చిన నాటి నుండి అమలు చేస్తున్న ప్రజా రంజక పాలన, ఆరు గ్యారెంటీలపైనే తమకు నమ్మకం ఉందని, ఇలాంటి మైండ్ గేమ్స్‌కు భయపడే ప్రసక్తే లేదని కాంగ్రెస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.తెలంగాణలో సర్వేల రాజకీయం కొత్తేమీ కాదు. అయితే, కేవలం సర్వేలను నమ్ముకుని సంబరపడితే మొదటికే మోసం వచ్చే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. గతంలో దేశవ్యాప్తంగా, అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ పలు రాజకీయ పార్టీలు అంతర్గత, ఐవీఆర్ఎస్, మీడియా సర్వేలను నమ్మి, క్షేత్రస్థాయి వాస్తవాలను విస్మరించి బొక్కబోర్లా పడ్డ ఉదాహరణలు అనేకం ఉన్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కూడా బీఆర్ఎస్ అనుకూలంగా అనేక సర్వేలు వచ్చాయని, కానీ క్షేత్రస్థాయిలో ప్రజల మూడ్ వేరేలా ఉందనే విషయాన్ని గ్రహించకపోవడం వల్లే ఆ పార్టీ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.

# అల్లు అర్జున్ పొలిటికల్ పార్టీ ప్రచారం...

**హైదరాబాద్ పెన్ పవర్:** సోషల్ మీడియా సమాజానికి ఎంత ఉపయోగపడుతోందో, అంతకంటే వేగంగా పనిలేని వారి ఊహా ప్రపంచం గా మారిపోతోంది. ముఖ్యంగా గత రెండు, మూడు రోజులుగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌ను టార్గెట్ చేస్తూ సాగుతున్న రాజకీయ ప్రచారం చూస్తుంటే.. అసలు తాను కొత్త పార్టీ పెడుతున్నానన్న విషయమో, లేదా ఒకరి ప్లాన్ ప్రకారం అడుగులు వేస్తున్నానన్న విషయమో కనీసం అల్లు అర్జున్‌కైనా తెలుసా? అనే అనుమానం రాక మానదు. రాజకీయాల్లో ఉన్న స్నేహితులతో లేదా బంధువులతో ఉండే వ్యక్తిగత అనుబంధాలతో ఒకరిద్దరితో దిగిన ఫోటోలనో, పర్యటనలనో బేస్ చేసుకుని కథలు అల్లేయడం డిజిటల్ మీడియాలో ఒక ఫ్యాషన్‌గా మారిపోయింది. తన దృష్టిని పూర్తిగా పాన్-ఇండియా కెరీర్ మీదే కేంద్రీకరించిన ఒక టాప్ హీరోను బలవంతంగా రాజకీయాల్లోకి లాగడం వెనుక సోషల్ మీడియా అల్గారిథమ్స్, వ్యూస్ వేట తప్ప మరోటి కనిపించడం లేదు.ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా నడుస్తున్న ప్రచారాల్లో ప్రధానంగా మూడు సిల్లీ థియరీలు వినిపిస్తున్నాయి. మొదటిది.. అల్లు అర్జున్ ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌తో రహస్య చర్చలు జరిపారని, ఒక పక్కా పొలిటికల్ స్కెచ్ సిద్ధం చేసుకుంటున్నారని కొందరు రాసుకొస్తున్నారు. మరికొందరైతే ఒక అడుగు ముందుకు వేసి.. తమిళనాడులో దళపతి విజయ్ తరహాలోనే, బన్నీ కూడా తన మామ చంద్రశేఖర్ రెడ్డి వ్యూహాలతో, పుష్ప సినిమాలలో అరెస్టుతో అవమానించిన రేవంత్ రెడ్డిని కాదని లంగాణలో కొత్త పార్టీ పెట్టి సీఎం అయిపోతారని గాల్లో మేడలు కడుతున్నారు. ఇంకొక వర్గం.. ఏపీలో జగన్ రెడ్డి ప్లాన్ ప్రకారమే అల్లు అర్జున్ అడుగులు పడుతున్నాయని, భవిష్యత్తులో అక్కడ చక్రం తిప్పుతారని సరికొత్త స్క్రిప్ట్ వండి వారుస్తున్నారు.దక్షిణాదిలో సినిమాలకు, రాజకీయాలకు విడదీయరాని బంధం ఉందనేది నిజమే. ఎన్టీఆర్, ఎంజీఆర్ లీగసీ నుంచి నిన్నటి పవన్ కల్యాణ్, నేటి విజయ్ వరకు వెండితెర ఇమేజ్‌తో రాజకీయాల్లో సక్సెస్ అయిన వారు ఉన్నారు. అయితే, ఒక నటుడు రాజకీయాల్లోకి రావాలా వద్దా అనేది అతని వ్యక్తిగత, సిద్ధాంతపరమైన నిర్ణయం. అల్లు అర్జున్ గతంలోనే తాను రాజకీయాలకు న్యూట్రల్ అని, తనకు అన్ని పార్టీల్లోనూ స్నేహితులు ఉన్నారని స్పష్టం చేశారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# వివాదాలు పక్కనపెట్టి మెగాస్టార్ సతీమణి సురేఖ ప్రమాణ స్వీకారం



**హైదరాబాద్ పెన్ పవర్:** శనివారం ఆలయ ప్రాంగణంలో జరిగిన అధికారిక కార్యక్రమంలో చైర్మన్ మన్నే సత్యనారాయణరెడ్డితో పాటు మెగాస్టార్ చిరంజీవి సతీమణి కొణిదెల సురేఖ సహా మొత్తం 18 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన పాలకమండలి కొలువుదీరింది. శనివారం ఆలయ ప్రాంగణంలో జరిగిన అధికారిక కార్యక్రమంలో చైర్మన్ మన్నే సత్యనారాయణరెడ్డితో పాటు మెగాస్టార్ చిరంజీవి సతీమణి కొణిదెల సురేఖ సహా మొత్తం 18 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరై నూతన బోర్డుకు శుభాకాంక్షలు తెలిపారు. అయితే భక్తిశ్రద్ధల మధ్య సాగిన ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం వెనుక ఒక పెద్ద రాజకీయ, సామాజిక చర్చ నడుస్తోంది. చిరంజీవి సతీమణి సురేఖ నియామకం ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

**వివాదానికి కారణం ఏమిటి?**

సురేఖ నియామకంపై తెలంగాణలోని కొన్ని రాజకీయ వర్గాలు, ప్రజాసంఘాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తిని తెలంగాణలో ఎంతో ప్రతిష్టాత్మకమైన యాదాద్రి దేవస్థాన బోర్డులో ఎలా నియమిస్తారనేది ప్రధాన అభ్యంతరం. తెలంగాణలోనే ఎంతోమంది అర్హులు, భక్తులు ఉండగా, పొరుగు రాష్ట్రానికి చెందిన వారికి ఈ అవకాశం ఇవ్వడంపై కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. "తెలంగాణ సెంటిమెంట్‌తో ముడిపడి ఉన్న యాదాద్రి ఆలయ బోర్డులో స్థానిక భక్తులకు ప్రాధాన్యత ఇవ్వాల్సింది." అని సోషల్ మీడియాలో చాలా మంది తెలంగాణ వాదులు హోరెత్తారు.

**మరో కోణం.. మద్దతుదారుల వాదన**

ఈ నియామకాన్ని తప్పుపట్టాల్సిన అవసరం లేదని ప్రభుత్వం తరఫున, మెగా అభిమానుల నుంచి గట్టి కౌంటర్ వస్తోంది. వారి వాదనల ప్రకారం చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా దశాబ్దాలుగా కొణిదెల కుటుంబం చేస్తున్న సామాజిక సేవలు, సురేఖగారి సేవా గుణం ఈ పదవికి పూర్తి అర్హతను కల్పిస్తున్నాయి. ఆధ్యాత్మిక సేవా రంగంలో ఎవరిని నియమించాలనేది పూర్తిగా ప్రభుత్వం యొక్క విచక్షణాధికార పరిధిలోని అంశం. దేవుడి సేవకు ప్రాంతీయ సరిహద్దులు పెట్టడం సరికాదనేది వీరి అభిప్రాయం.

**కొత్త బోర్డు ముందున్న సవాళ్లు**

వివాదాలు ఎలా ఉన్నా దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక కేంద్రంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న యాదాద్రి ఆలయ భవిష్యత్తు ఇప్పుడు ఈ నూతన పాలకమండలి చేతుల్లో ఉంది.

వివాదాల నడుమ బాధ్యతలు స్వీకరించిన ఈ సరికొత్త పాలకమండలి, యాదాద్రి వైభవాన్ని మరింత పెంచేలా ఎలాంటి నిర్ణయాలు తీసుకోబోతుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ప్రాంతీయ వివాదాలను పక్కన పెట్టి, భక్తుల నమ్మకాన్ని ఈ బోర్డు ఎలా నిలబెట్టుకుంటుందో వేచి చూడాలి.

# 'ఏడు ఇటుకల' మిస్టరీ: ఆరు హత్యలా? ఏడు హత్యలా?
# బాలిక తండ్రి మరణం వెనుక కూడా రాజ్‌కుమారేనా?

**హైదరాబాద్ పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దైవాలగూడలో జరిగిన సామూహిక హత్యలు తెలంగాణ చరిత్రలోనే అత్యంత భయానక నేరాల్లో ఒకటిగా నిలిచిపోయాయి. మొదట ఇది ఆరు హత్యల కేసుగా నమోదైనా... ఇప్పుడు గ్రామంలో వినిపిస్తున్న మాట మాత్రం వేరే కథ చెబుతోంది. "ఇవి ఆరు కాదు... ఏడు హత్యలు" అంటున్నారు స్థానికులు.

ఆ అనుమానానికి బలం చేకూర్చిన అంశం... హత్య జరిగిన ప్రదేశంలో నిందితుడు పేర్చి పెట్టిన ఏడు ఇటుకలు. ఆ ఏడో ఇటుక ఎవరి కోసం? గత ఏడాది అనుమానాస్పదంగా చనిపోయిన బాలిక తండ్రి మరణానికి కూడా రాజ్‌కుమారే కారణమా? ఇప్పుడు ఇదే ప్రశ్న గ్రామాన్ని, పోలీసులను వెంటాడుతోంది.



**ఒకే రాత్రిలో రెండు కుటుంబాల అంతం**

పోక్సో కేసులో తనపై ఫిర్యాదు చేసిన కుటుంబంపై నిందితుడు రాజ్‌కుమార్ పగను గుండెల్లో పెట్టుకున్నాడు. బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత ప్రతీకారం తీర్చుకోవడమే రోజుల తరబడి ప్లాన్ వేసినట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి వేళ ముందుగా బాధితురాలి ఇంట్లోకి చొరబడ్డాడు. గాఢ నిద్రలో ఉన్న బాలిక తల్లి, నానమ్మను కత్తితో నరికి చంపేశాడు. అక్కడితో ఆగకుండా 17 ఏళ్ల బాలికను బలవంతంగా తీసుకెళ్లి నాగర్‌కుంట చెరువు వద్ద హత్య చేశాడు. ఆ తర్వాత నేరుగా తన ఇంటికి చేరుకుని భార్య సరిత, మూడేళ్ల కుమారుడు, రెండేళ్ల కుమార్తెను కూడా అత్యంత కిరాతకంగా చంపేశాడు. మొత్తం ఆరుగురు ప్రాణాలు క్షణాల్లో బలి అయ్యాయి. ఘాతుకం అనంతరం తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి... "ఆరుగురిని చంపేశాను... నేనూ చనిపోతున్నాను" అని చెప్పి పరారయ్యాడు.

**కానీ గ్రామం చెబుతున్న కథ వేరు... ఏడో హత్య నిజమేనా?**

స్థానికుల మాటల్లో మాత్రం ఈ కేసు ఇక్కడితో ముగియదు. వారి అనుమానం ప్రకారం... గత ఏడాది బాధిత బాలిక తండ్రి మల్లేష్ ఆకస్మిక మరణం కూడా సహజం కాదట. మల్లేష్‌కు మద్యం తాగే అలవాటు ఉండేది. ఆ కారణంగా ఆయన మరణాన్ని అందరూ సహజంగానే భావించారు. కానీ తర్వాత జరిగిన పరిణామాలు చూస్తే... ఆయన మరణం వెనుక కూడా రాజ్‌కుమార్ ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అనుమానానికి కారణం... రాజ్‌కుమార్ స్వయంగా చేసిన బెదిరింపులేనని కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

**"మీ ఇంటి పెద్దను చంపాను..."**

బాలికను వేధించడం తట్టుకోలేక కుటుంబ సభ్యులు తీవ్రంగా అభ్యంతరం చెప్పారు. ఒకసారి కాలేజీ వద్ద బాలిక చేయి పట్టుకుని లాగడంతో ఆమె తల్లి అడ్డుకుంది. ఆ సమయంలో రాజ్‌కుమార్ చేసిన హెచ్చరిక ఇప్పుడు కేసులో కీలకంగా మారింది. "మీ ఇంటి పెద్దను చంపినట్టే... మీ అందరినీ చంపేస్తా" అని అప్పుడే బెదిరించాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అప్పుడు వరకు మల్లేష్ మరణాన్ని సహజంగానే భావించిన కుటుంబానికి... ఈ మాటలతో అనుమానం మొదలైంది.

**పోక్సో కేసు... ప్రతీకారానికి బీజం**

మే 16న రాజ్‌కుమార్‌పై పోక్సో కేసు నమోదైంది. అప్పటి నుంచి అతడు పరారీలో ఉన్నాడు. అనంతరం బెయిల్ తెచ్చుకుని సుమారు 15 రోజుల క్రితం గ్రామానికి వచ్చాడు. అయితే బయటకు మాత్రం చాలా మంచివాడిలా నటించాడని గ్రామస్థులు చెబుతున్నారు. ఎవరితోనూ గొడవపడలేదు.. నవ్వుతూ మాట్లాడాడు. కానీ లోపల మాత్రం ప్రతీకారం కోసం ప్రతి అడుగు ప్లాన్ చేశాడని ఇప్పుడు అందరూ అనుమానిస్తున్నారు.

**తన పిల్లల్ని కూడా బలి ఇవ్వాలని ముందే నిర్ణయించుకున్నాడా?**

రాజ్‌కుమార్ ఇంట్లో జరిగిన మరో సంఘటన ఇప్పుడు చర్చనీయాంశమైంది. హత్యలకు రెండు రోజుల ముందు అతని చిన్న కుమారుడు ఒక ఉంగరం మింగేశాడు. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలని కుటుంబ సభ్యులు చెప్పినా... రాజ్‌కుమార్ పట్టించుకోలేదట. సాధారణ తండ్రి అయితే వెంటనే ఆసుపత్రికి పరుగెత్తేవాడు, కానీ అతను అలా చేయలేదు. అందుకే... అప్పటికే తన కుటుంబాన్ని కూడా చంపేయాలని నిర్ణయించుకున్నాడని బంధువులు అనుమానిస్తున్నారు.

**భార్యపై అమానుష వేధింపులు**

రాజ్‌కుమార్ ప్రవర్తన పెళ్లికి ముందే వివాదాస్పదంగా ఉండేదని గ్రామస్థులు చెబుతున్నారు. సరితకు మరో సంబంధం వచ్చినా... ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించి పెళ్లి చేసుకున్నాడట. పెళ్లి తర్వాత కూడా ఆమెను "అందంగా లేవు... నిన్ను చేసుకుని తప్పు చేశాను" అంటూ మానసికంగా, శారీరకంగా వేధించేవాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. సరితకు విడాకులు తీసుకుని రావాలని ఆమె కుటుంబం ఎన్నిసార్లో చెప్పినా... "మారతాడు" అనే ఆశతో ఆ కుటుంబం ఎదురు చూసింది. చివరకు అదే ఆమె ప్రాణాలు తీసింది.

**స్నేహితుడి ఇంటిపైనే కన్ను**

బాధిత బాలిక కుటుంబంతో రాజ్‌కుమార్‌కు మొదట మంచి స్నేహం ఉండేదట. బాలిక తండ్రితో కలిసి తిరిగేవాడు. ఆ పరిచయంతోనే బాలికపై కన్నేసి, వేధించడం మొదలుపెట్టాడు. కుటుంబం హెచ్చరించడంతో... వారి ఇంటికి వెళ్లకుండా ఆపేశారు. అయితే గ్రామస్థుల ఆరోపణల ప్రకారం... వారి ఇంటి సీసీటీవీ కెమెరాలను కూడా తన మొబైల్‌కు కనెక్ట్ చేసుకుని ఎవరు వస్తున్నారు... ఎవరు వెళు తున్నారు అన్నది గమనించేవాడట. ఈ ఆరోపణలను పోలీసులు ఇంకా అధికారికంగా ధృవీకరించలేదు.

**ఏడు ఇటుకల మిస్టరీ... అసలు అర్థమేంటి?**

ఈ కేసులో అత్యంత సంచలన అంశం... నాగర్‌కుంట చెరువు వద్ద కనిపించిన ఏడు ఇటుకలు. బాలికను హత్య చేసిన ప్రదేశంలో ఒకదానిపై ఒకటి క్రమపద్ధతిలో ఏడు ఇటుకలను పేర్చి ఉంచినట్లు పోలీసులు గుర్తించారు. ఇది క్షుద్రపూజలా? మూఢనమ్మకమా? లేక తాను చేసిన హత్యలకు ప్రతీకగా పెట్టాడా? లేదంటే... గ్రామస్థులు చెబుతున్నట్లుగా ఏడో హత్యకు సంకేతమా? అన్నది అనుమానంగా మారింది. ఇది ఇప్పుడు దర్యాప్తులో అత్యంత కీలకమైన మిస్టరీగా మారింది. మల్లేష్ మరణానికి, ప్రస్తుత హత్యలతో సంబంధం ఉందా? అనే అంశం దర్యాప్తులో తేలాల్సి ఉంది.

**పోలీసులపై తీవ్ర ఆరోపణలు**

బాధిత కుటుంబ సభ్యులు పోలీసులపైనా తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. మే 16న పోక్సో ఫిర్యాదు చేసినప్పటికీ... నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోలేదని అంటున్నారు. బాలిక మేనమామ సురేష్ ఆవేదన వ్యక్తం చేస్తూ "పోలీసులు మా ఫిర్యాదును సీరియస్‌గా తీసుకుని ఉండి ఉంటే... ఈ రోజు ఆరుగురు బతికి ఉండేవారు" అని ఆరోపించారు. గ్రామస్థులు కూడా పోలీసుల నిర్లక్ష్యమే ఈ ఘోరానికి కారణమంటూ ఆందోళన చేపట్టారు. రాజ్ కుమార్ పై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ లో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. గతంలో బాలిక తండ్రిని చంపింది కూడా రాజ్ కుమార్ యేనా? అన్న అనుమానాలు వస్తున్నాయి. రాజ్ కుమార్ ఆ బాలికను 6 నెలలుగా వేధిస్తున్నాడు. కాలేజీకి వెళ్లే సమయంలోనూ వేధించాడు. దీంతో రాజ్ కుమార్ భయంతో కాలేజీకి కూడా బాలిక వెళ్లడం లేదు. పరీక్షల సమయంలో బాలిక బయటకు వచ్చినా రాజ్ కుమార్ తన వెంట రావాలంటే లాక్కెళ్లేవాడని తెలిసింది. ప్రస్తుతం పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. గ్రామంలో వినిపిస్తున్న ఆరోపణలు, అనుమానాలు అధికారికంగా ఇంకా నిర్ధారించబడలేదు. దర్యాప్తు పూర్తయిన తర్వాతే అసలు నిజానిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# పెద్దాయన రాయలసీమ గళం విప్పుతారా ?

ఏపీలో అతి ముఖ్యమైన రీజియన్ గా రాయలసీమ ఉంది. రాయలసీమ ప్రాంతం ఆంధ్ర రాష్ట్ర విభజనకు ముందు ఉమ్మడి మద్రాస్ స్టేట్ లో ఉండేది. అయితే ప్రత్యేక రాష్ట్రంగా ఏపీ ఆవిర్భవించాలనుకున్నపుడు మొదట్లో రాయలసీమ కలసిరాలేదు. మాకు మద్రాస్ స్టేట్ తో బాగానే ఉంది అని కూడా అనుకుంది. చివరికి శ్రీభాగ్ ఒప్పందం మేరకు రాయలసీమ కూడా కలసి వచ్చింది. దాని ప్రకారం చూస్తే కొత్త స్టేట్ లో రాజధాని అయినా లేదా హైకోర్టు అయినా తమకు ఉండాలని కోరినట్లుగా ఒప్పందంలో ఉంది. ఇక 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినపుడు కర్నూల్ రాజధాని అయింది. గుంటూరులో హైకోర్టు ఏర్పాటు అయింది. తిరిగి 2014లో ఉమ్మడి ఏపీ విడిపోయినపుడు రాజధాని అయినా హైకోర్టు అయినా ఏదో ఒకటి దక్కాలని అనుకున్న అది జరగలేదు. అయితే కూటమి ప్రభుత్వం హైకోర్టు బెంచ్ ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. అంతే కాదు రాయలసీమను రతనాల సీమను చేస్తామని కూడా చెబుతూ ఆ దిశగా చర్యలను చేపడుతోంది.



**సాగు నీటి ప్రాజెక్టులు :**

అదే విధంగా చూస్తే రాయలసీమకు సాగు తాగు నీటి కొరత ఉంది. వాటి విషయంలో పాలకులు ఆలోచన చేయాలని కూడా ఉంది. అలాగే ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ఉపాధి అవకాశాలు మాత్రం పెద్దగా పెరగడం లేదు. అదే సమయంలో పరిశ్రమలు వస్తున్నాయని అంటున్నా రాయలసీమలో అనేక సమస్యలు ఉన్నాయని అంటున్నారు. దాంతో రాయలసీమ విషయంలో ఇంకా అసంతృప్తి స్వరాలు గట్టిగా వినిపిస్తూనే ఉన్నాయి. ఈ నేపధ్యంలో మాజీ మంత్రి మైసూరారెడ్డి అయితే రాయలసీమ విషయంలో తన స్థిరరమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఒక యూ ట్యూబ్ చానల్ లో ఆయన మాట్లాడుతూ రాయలసీమకు తగిన న్యాయం జరగాలని కోరుకున్నారు.

**ఇద్దరూ ఏమీ చేయలేదు :**

రాయలసీమ ప్రాంతానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కానీ మాజీ సీఎం వైఎస్ జగన్ కానీ ఏమీ చేయలేదని మైసూరారెడ్డి విమర్శించారు. రాయలసీమలో అనేక సమస్యలు ఉన్నాయని ఆయన అన్నారు. వాటి కోసం అంతా కృషి చేయాలని పరిష్కరించాలని కోరుతున్నారు. ఇదిలా ఉంటే రాయలసీమ సమస్యల పట్ల మళ్ళీ తన గళాన్ని వినిపించాలని మైసూరారెడ్డి ఆలోచిస్తున్నారు అని ప్రచారం సాగుతోంది. రాయలసీమ అభివృద్ధి మీద అయితే ఇప్పటికీ అంతా అసంతృప్తిగానే ఉన్నారు. పాలకులు మారినా ప్రభుత్వాలు ఎన్ని వచ్చినా వెనకబాటు తనం పోవడం లేదన్న బాధ అయితే అందరిలో ఉంది.

**రాజకీయాలకు దూరంగా :**

ఇక మైసూరారెడ్డి చూస్తే రాజకీయాలకు దూరంగానే ఉంటూ వతున్నారు. ఆయన రాజకీయ జీవితం బాగా వెలిగింది కాంగ్రెస్ పార్టీలోనే అని గుర్తు చేస్తున్నారు. 1983 నుంచి మూడు సార్లు వరసగా కమలాపురం నుంచి గెలిచిన మైసూరారెడ్డి నేదురుమల్లి జనార్ధనరెడ్డి ప్రభుత్వంలో హోం మంత్రిగా పనిచేశారు. కోట్ల విజయభాస్కర్ రెడ్డి మంత్రి వర్గంలో కూడా పనిచేశారు. ఆ తరువాత మూడున్నర దశాబ్దలౌగా చూస్తే

ఆయన రాజకీయంగా కీలక పదవులలో లేరు. మధ్యలో టీడీపీలో చేరి ఒకసారి రాజ్యసభకు వెళ్ళారు. వైసీపీలో చేరినా ఆయనకు అధికార పదవులు దక్కలేదు. మొత్తానికి పదేళ్ళుగా రాజకీయాలు దూరంగా ఉంటున్న ఆయన రాయలసీమ సమస్యల మీద ఉద్యమించేందుకు సిద్ధపడుతున్నారా అన్న చర్చ సాగుతోంది. మరి ఆయన కనుక రంగంలోకి దిగితే రాజకీయం అక్కడ ఏ విధంగా మారుతుందో చూడాల్సి ఉంది అని అంటున్నారు.

# చిన్నమ్మ సంగతి ఏంటీ

**రాజమండ్రి, జూలై 11, పెన్ పవర్:**

రాజమండ్రి పార్లమెంటు సభ్యురాలు పురంద్రీశ్వరికి ఈ టర్మ్ లో కీలక పదవి దక్కే అవకాశం లేనట్లే ఉంది. కేంద్ర మంత్రి వర్గ విస్తరణ జరిగినప్పుడల్లా ఆమె పేరు పదే పదే వినిపించడం చివరి నిమిషంలో దక్కకపోవడం జరుగుతుంది. ఈసారి కూడా అదే జరుగుతుందోమేనన్న ఆందోలన చిన్నమ్మ అభిమానుల్లో ఉంది. త్వరలో కేంద్ర మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలోపురంద్రీశ్వరికి మళ్లీ పదవి దక్కుతుందని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. కానీ కష్టమేనని చెబుతున్నారు. అందుకు అనేక కారణాలున్నాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా, ఎన్టీఆర్ కుమార్తెగా ఆమె పార్టీ కోసం బాగా పనిచేసినప్పటికీ కొన్ని కారణాలు ఆమె పదవికి అడ్డం పడుతున్నాయన్నది హస్తిన వర్గాల నుంచి అందుతున్న సమాచారం. 2024లో కేంద్రంలో, రాష్టంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో ఆమె కేంద్ర మంత్రి పదవి వస్తుందని అనుకున్నారు. కానీ నర్సాపురం పార్లమెంటు సభ్యుడు శ్రీనివాసవర్మను కేంద్ర మంత్రివర్గంలోకి అనూహ్యంగా తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వంలో టీడీపీకి మాత్రం రెండు పదవులు లభించాయి. తెలంగాణలో ఎనిమిది స్థానాలను గెలవడంతో ఇద్దరికి మంత్రి పదవులు దక్కాయి. టీడీపీ నుంచి కేంద్ర మంత్రిగా ఉన్న గుంటూరు పార్లమెంటుసభ్యులు పెమ్మసాని చంద్రశేఖర్ ప్రధాన కారణం. ఆయనను కేంద్ర మంత్రి వర్గం నుంచి తప్పించే ఛాన్సులు అయితే లేవు. ఎందుకంటే పెమ్మసాని లోకేశ్ కు, చంద్రబాబుకు అత్యంత ఆప్తుడు. పెమ్మసాని కమ్మ సామాజికవర్గం కావడంతో ఇకపురంద్రీశ్వరికి ఆకోటాలో మంత్రివర్గంలో చోటు కల్పించలేని పరిస్థితి నెలకొంది. ఇక జాతీయ అధ్యక్ష పదవి అనికొన్నాళ్లు పురంద్రీశ్వరి పేరు



వినిపించింది. కానీ అది సాధ్యం కాలేదు. తర్వాత స్పీకర్ పదవి అన్నారు. ఓంబిర్లాను ఆ పదవి నుంచి తప్పించే అవకాశాలు లేవు. పురంద్రీశ్వరి కి కేంద్రంలో కీలకమైన పదవులు ఈసారి అంటే రానున్న మూడేళ్ల కాలంలో దక్కే అవకాశం లేదన్నది పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి, ఇక్కడ పురంద్రీశ్వరి ఎంపీగా మరొకసారి విజయం సాధిస్తే అప్పుడు చూడొచ్చులే అన్న ధోరణిలో కేంద్ర

నాయకత్వం ఉందని తెలిసింది. మొత్తం మీద చిన్నమ్మకు ఈ టర్మ్ లో మాత్రం ఎటువంటి పదవులు.. ఇటు ప్రభుత్వంలో కానీ, అటు పార్టీలో కానీ దక్కే అవకాశాలు లేవన్నది వాస్తవం. అందుకే పురంద్రీశ్వరి రాజమండ్రి నుంచి మరోసారి గెలిచేందుకు బేస్ ను పటిష్టం చేసుకునేందుకే ఎక్కువ సమయం వెచ్చిస్తున్నారు

# రతనాల సీమగా మారుతున్న రాయలసీమ

**తిరుపతి, జూలై 11, పెన్ పవర్:**

ఫ్యాక్షన్ గొడవలు.. బాంబులు.. కొట్లాటలు.. ప్రాణాలు తీయడాలు.. ఇవి సినిమాలో మాత్రమే కాదు.. రాయలసీమలో రియల్ గా జరిగేవి. ఐదు రూపాయల కోసం దారుణాలు జరుగుతాయని ఓ సినిమాలో చూపించారంటే.. రాయలసీమలో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు . ఒకప్పుడు శ్రీకృష్ణదేవరాయలు పరిపాలించిన రాయలసీమ.. కరువుకు కేరాఫ్ అడ్రస్. వలసలకు కేరాఫ్ అడ్రస్. దారిద్రానికి

కేరాఫ్ అడ్రస్. కానీ ఇప్పుడు మారిపోయింది. కూటం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత రాయలసీమ తనముఖ చిత్రాన్ని ఈసారి పూర్తిగా మార్చుకుంటున్నది. ఒక నివేదిక ప్రకారం రాయలసీమ ప్రాంతంలో సుమారు 4.58 లక్షల పెట్టుబడులను కంపెనీలు పెడుతున్నట్టు తెలుస్తోంది. ఇక్కడ ఏకంగా 275 పారిశ్రామిక ప్రాజెక్టులు వివిధ దశలో ఉన్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా బెంగళూరు, కర్ణాటక సరిహద్దు చుట్టుపక్కల ప్రాంతాలు వివిధ రంగాల పెట్టుబడులతో నిరంతరం అభివృద్ధి చెందుతున్నాయి.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాయలసీమ కర్ణాటకసరిహద్దు ప్రాంతంలో ఉంటుంది. ఒకప్పుడు ఏమో గాని.. ఇప్పుడైతే అత్యంత ఆశాజనకమైన అభివృద్ధి ప్రాంతాలలో ఒకటిగా నిలవబోతోంది. ఒకప్పుడు ఈ ప్రాంతం కరువు భూమిగా పేరుగాంచింది. ఇప్పుడు పునర్వాదక ఇంధనం.. తయారీరంగం.. లాజిస్టిక్స్.. వంటి రంగాలలో మొత్తంగా 275 పారిశ్రామిక ప్రాజెక్టులు ఏర్పాటు కాబోతున్నాయి. ఫలితంగా రాయలసీమ దక్షిణ భారతదేశంలోనే అత్యంత పెద్దదైన పారిశ్రామిక కేంద్రంగా రూపాంతరం చెందబోతోంది.రాయలసీమ లో అన్నమయ్య.. సత్యసాయి.. అనంతపురం.. నంద్యాల.. కడప.. కర్నూలు.. తిరుపతి వంటి ఏడు జిల్లాలు ఉన్నాయి.. ఈ ఏడు జిల్లాలు

బెంగళూరు.. హైదరాబాద్.. చెన్నై నగరాలతో అనుసంధానం చేసే జాతీయ ప్రధాన రహదారులను కలిగి ఉన్నాయి. అనంతపురం కర్ణాటక సరిహద్దుకు 55 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. సత్య సాయి పుట్టపర్తి 75 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఈ ప్రాంతంలో హిందూపూర్ కర్ణాటక రాష్ట్ర సరిహద్దుకు 20 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. కర్నూలు 95 కిలోమీటర్లు.. నంద్యాల 150 కిలోమీటర్లు.. కడప 150 కిలోమీటర్లు.. అన్నమయ్య 140 కిలోమీటర్లు.. తిరుపతి 2.0 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.4.5 లక్షల కోట్ల పెట్టుబడి ద్వారా మొత్తంగా 3.57 లక్షల ఉద్యోగాలు వస్తాయని తెలుస్తోంది.. పునరుత్పాదక శక్తి తయారీ.. ఎలక్ట్రానిక్స్.. ఆహార శుద్ధి.. సిమెంట్.. లాజిస్టిక్స్.. వస్త్ర పరిశ్రమ వంటి రంగాలలో ఇక్కడ కర్మాగారాలు ఏర్పాటు కాబోతున్నాయి. అతిపెద్దదైన సౌర. పవన విద్యుత్ ప్రాజెక్టులకురాయలసీమ కేంద్రంగా మారబోతోంది.గ్రీన్కో సమీకృత పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు కర్నూలులోని పిన్నపురం ప్రాంతంలో ఏర్పాటు కాబోతోంది. ఈ ప్రాజెక్టు మీద గ్రీన్కో కంపెనీ 30 వేల కోట్లకు పైగాపెట్టుబడి పెడుతోంది.. ఈ ప్రాజెక్టు మొత్తం 5230 మెగా వాట్ల సామర్థ్యంతో పనిచేస్తుంది. ఇందులో మూడు వేల మెగావాట్లు సౌర విద్యుత్.. 550 మెగావాట్లు పవన, 1680 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీలుఉన్నాయి.జటటఎస్ డ బ్ల్యూ రాయలసీమ సమీకృత ఉక్కు కర్మాగారం. కడప ప్రాంతంలో రాయలసీమ సమీకృత ఉక్కు కర్మాగారాన్ని నిర్మించేందుకు జటటఎస్ డ బ్ల్యూ స్టీల్ 16,350 కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ కర్మాగారం ప్రారంభ సామర్థ్యం 2 ఎంటీపీఏ గా ఉంది. భవిష్యత్ కాలంలో అది 5 ఎంటీపీఏ కు విస్తరించే అవకాశం ఉంది. దీనిద్వారా పదివేల మందికి పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుంది.సత్యసాయి అనంతపురం జిల్లాలో 72 గిగా వాట్ల సామర్థ్యంతో సోలార్ పార్కులు ఏర్పాటు కాబోతున్నాయి. ఇందులో మడకశిర సోలార్ పార్క్ ఏడువేల కోట్లతో ఏర్పాటు కాబోతోంది. యశస్వ పవర్ ప్రాజెక్ట్ 2 మెగా వాట్లు.. ఎన్టిపిసి సోలార్ పార్క్ 1.2 గిగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు కాబోతోంది.సత్యసాయి జిల్లాలో 51,300 కోట్ల ప్రతిపాదిత పెట్టుబడితో రాయలసీమలోనే అతిపెద్ద సౌర ప్రాజెక్టును ఏర్పాటు చేస్తోంది. ఇవిమాత్రమే కాకుండా ఇండి చిప్ సెమీ కండక్టర్ ప్రాజెక్ట్ కర్నూలు ప్రాంతంలో ఏర్పాటు కాబోతోంది. 14,000 కోట్ల పెట్టుబడితో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే రెండు నుంచి మూడు సంవత్సరాల వ్యవధిలోనెలకు 10,000 నుంచి 50 వేల వేపర్లను ఇక్కడ ఉత్పత్తి చేస్తారుతిరుపతిలో 2,500 కోట్ల వ్యయంతో రాయల్ ఎన్ఫీల్డ్ మ్యానుఫ్యాక్చరింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు కాబోతోంది. కంపెనీ వార్షిక ఉత్పత్తికి అదనంగా 9 లక్షల మోటారు సైకిళ్లను తయారుచేస్తారు. 5000 నుంచి 15వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి.క్యారియర్ గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ.. శ్రీ సిటీ ప్రాంతంలో 1000 కోట్ల ఖర్చుతో కొత్త ప్లాంట్ ఏర్పాటుకాబోతోంది. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి ప్రాంతంలో లక్ష కోట్ల విలువైన గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేయబోతున్నారు. దక్షిణ కొరియాలోని పేరుపొందిన పాదరక్షల తయారీ సంస్థ హ్వా సింగ్ అనేకంపెనీ 898 కోట్ల పెట్టుబడితో చిత్తూరులో తన మొట్టమొదటి భారతీయ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతోంది. మొత్తంగా 17,000 మందికి ఉద్యోగాలు కల్పించబోతోంది.రిలయన్స్ రిటైల్ పానీయాలకేంద్రం కర్నూల్ లోని ఓర్వకల ప్రాంతంలో ప్లాంట్ ఏర్పాటు చేయబోతోంది. సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో వందల కోట్ల పెట్టుబడి పెట్టాలని చూస్తోంది. 5000 మందికి ప్రత్యక్షంగా.. పరోక్షంగా ఉద్యోగాలు ఇవ్వబోతోంది.

# ఒక అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి

**విశాఖపట్టణం, జూలై 11, పెన్ పవర్:** పీవీఎన్.మాధవ్ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సుపరిచితమైన పేరు. కమలం పార్టీ ఆంధ్రప్రదేశ్ సారథిగా సరిగ్గా ఏడాది క్రితం బాధ్యతలు చేపట్టారు. టీడీపీ, బీజేపీ, జనసేన నేతృత్వంలో ఏపీలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2025 జూలై 8న ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. దగ్గుబాటి పురంధేశ్వరి నుంచి ఈ హోదా అందుకున్న ఆయన ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ నుంచి రాజకీయ జీవితం ప్రారంభించిన యువ నాయకుడు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఎంబీఏ చదివిన ఆయన 2017లో గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఉత్తరాంధ్రకు చెందిన బీసీ వర్గానికి చెందిన ఆయన తండ్రి పీవీ చలపతిరావు ఏకీకృత ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఈ కుటుంబ వారసత్వం, సంస్థాగత అనుభవం ఆయన నియామకానికి కారణమయ్యాయి. విజయవాడలో ఏబీవీపీ స్థాపన దినోత్సవం సందర్భంగా భారీ ర్యాలీలో మాధవ్ అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌కు పూలమాల వేసి, తెలుగు కవి విశ్వనాథ సత్యనారాయణ విగ్రహానికి మాలలు వేశారు. లెనిన్ సెంటర్‌ను విశ్వనాథ సత్యనారాయణ పేరిట మార్చాలని డిమాండ్ చేశారు. 'పార్టీ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లి, గ్రాస్‌రూట్ స్థాయిలో బలోపేతం చేస్తాం. ప్రతి కార్యకర్త నాయకుడిలా భావించి, క్రమశిక్షణతో, జాతీయ స్ఫూర్తితో పనిచేయాలి' అని ప్రతిజ్ఞ చేశారు. అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పురంధేశ్వరి ఆయన నాయకత్వంలో పార్టీ మరింత ఎదుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.మాధవ్ నాయకత్వంలో బీజేపీ సంస్థాగతంగా చురుకుగా ముందుకు సాగుతోంది. 2026 జూన్ 30న రాష్ట్రంలోని 28 జిల్లాలకు ఇన్‌ఛార్జిలను నియమించారు. ఇది పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలపరచడానికి చేపట్టిన చర్య. 'మన ఊరు -- మన జెండా' కార్యశాలలు నిర్వహించి, పార్టీ సిద్ధాంతాలు, సేవా కార్యక్రమాలను గ్రామ గ్రామానికి, ఇంటింటికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. కొత్త జిల్లాలతో కమిటీలు ఏర్పాటు చేసి, గ్రామ స్థాయి నుంచి బూత్ వరకు నిర్మాణం పటిష్టం చేశారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.కూటమి ప్రభుత్వంలో బీజేపీకి నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల టికెట్ల విషయంలో క్యాడర్‌లో అసంతృప్తి ఉందని ముందుగా చెప్పినట్లే ఉంది. అయితే మాధవ్ నాయకత్వంలో బీజేపీ మరింత ప్రాధాన్యత సాధించాలని, ఎమ్మెల్యేలు, ఎంపీల సంఖ్యను రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కేంద్రం నుంచి మరిన్ని నిధులు తీసుకురావడం, కూటమిలో బీజేపీకి మరిన్ని అవకాశాలు కల్పించడం వైపు దృష్టి పెట్టారు. రెండేళ్ల కూటమి పాలనలో రాజ్యసభలో రెండు సీట్లు, ఒక ఎమ్మెల్సీ సీటు దక్కినప్పటికీ, మరిన్ని కీలక పదవులు కోరుతున్నారు.2026 జూన్‌లో తిరుపతిలో ఎన్డీఏ విజయోత్సవ సభలో మాధవ్ మాట్లాడుతూ, 'డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల రాష్ట్ర అభివద్ధి వేగంగా జరుగుతోంది. రూ.14 లక్షల కోట్ల ప్రాజెక్టులు వాస్తవరూపం దాలుస్తున్నాయి' అని చెప్పారు. కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కూటమి విజయాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ నేతత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా దూసుకుపోతోందని ప్రశంసించారు. యువతను వికసిత భారత్ కోసం రాజకీయాల్లోకి రావాలని, సాంకేతికత, ఆవిష్కరణలపై దష్టి పెట్టాలని సూచించారు.మాధవ్ తన ఏడాది కాలంలో పార్టీ బలం గణనీయంగా పెరిగిందని, మరింత పుంజుకుంటామని చెప్పారు. సంస్థాగత నిర్మాణం బలపడిందని, అనేక కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. అయితే క్యాడర్‌లో అధికారంలో ఉన్నామా అన్న అనుమానం ఉందని, ఇంకా జోరు పెంచాలని అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొందరు సీనియర్ నాయకులు నిశ్శబ్దంగా ఉన్నారని, స్థానిక సంస్థల టికెట్లలో బీజేపీకి తగిన వాటా రావాలని ఒత్తిడి ఉంది. అయితే మాధవ్ నాయకత్వంలో 28 జిల్లాల ఇన్‌ఛార్జిల నియామకం, గ్రామ స్థాయి కార్యక్రమాలు పార్టీని మరింత చురుకుగా మార్చాయని అభిప్రాయం కూడా ఉంది. మొత్తం మీద ఏడాదిలో సంస్థాగతంగా కొన్ని అడుగులు ముందుకు పడ్డాయి, కానీ క్యాడర్‌లో మరిన్ని ఫలితాలు ఆశిస్తున్నారుఇది మాధవ్ ఏడాది కాలంలో జరిగిన ముఖ్య అంశాల సమగ్ర సమీక్ష. పార్టీ బలోపేతం కోసం ఇంకా చేయవలసినవి చాలా ఉన్నాయని నాయకులు అభిప్రాయపడుతున్నారు.

# పరుగులు పెడుతున్న అమరావతి



**విజయవాడ, జూలై 11, పెన్ పవర్:** తెలంగాణ ఉద్యమం ప్రాంతీయ ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. ఆ సమయంలో పార్టీల, వర్గాల ఒక లక్ష్యం కోసం కట్టుబడ్డారు. ఆ యుద్ధ భావననతోనే ప్రత్యేక రాష్ట్రం సాధ్యమైంది. ఆంధ్రాప్రాంత ప్రజలు వ్యతిరేకించినా.. తెలంగాణ మొత్తం ఏకమైంది. లక్ష్యం చేరుకుంది. అలాంటి ఐక్యత ఆంధ్రప్రదేశ్ ప్రజల్లో కనిపించడం లేదు. రాష్ట్ర విభజన జరిగి 12 ఏళు గడిచినా రాజధాని లేని రాష్ట్రంగానే మిగలిపోయింది. సీఎం చంద్రబాబు నాయుడు రాజధాని అమరావతి కోసం సంకల్పం తీసుకున్నారు. రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారు. రాజధాని నిర్మాణ పనలూ వేగంగా జరుగుతున్నాయి. అయితే ఐదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన జగన్‌మోహన్‌రెడ్డి అమరావతిని వ్యతిరేకించడంతో రాజధానికి అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. రాజకీయ వాతావరణం, వ్యక్తిగత వ్యూహాలు, అధిష్టాన ఉద్దేశాల కారణంగా సమస్య మరింత క్లిష్టంగా మారింది.ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి ఒక బ్రాండ్ తీసుకురావడానికి సీఎం చంద్రబాబునాయుడు అహర్నిలు కష్టపడుతున్నారు. అమరావతి పరపతి మాత్రమే కాదు, హక్కు కూడా. పార్లమెంట్ ద్వారా అమరావతిని రాష్ట్ర రాజధానిగా ధ్రువీకరించి తీర్మానం ఉన్నప్పటికీ, అమరావతి ప్రాధాన్యతను అభివృద్ధి, ఆర్థిక పునర్రూపకల్పన, రైతు సంకల్పంతో కూడిన సామాజిక ఒప్పందంగా చూడాలి. ఎన్నో వేల ఎకరాలు దిగుబడిలేని భూములను రైతులు స్వచ్ఛందంగా ఇచ్చి తమ భవిష్యత్‌కు బాటలు వేసుకున్నారు. ప్రాజెక్టులు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల రూపొందింపు ఈ పట్టదారుల ఆశలపై ఆధారపడి ఉన్నాయి.అయితే రాజకీయంగా పరిస్థితి మరోలా ఉంది. రాష్ట్రపతి స్థాయిలో అమరావతి నిర్ణయాన్ని సైతం మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వ్యతిరేకిస్తున్నారు.అధికారంలో ఉన్నప్పుడు, అధికారం కోల్పోయిన తర్వాత కూడా రాజధాని నిర్ణయానికి వ్యతిరేకంగా ఉన్నారు. భవిష్యత్‌లో 'మావిగన్' అంటూ కొత్త రాగం ఎత్తుకున్నారు. ఇలాంటి రాజకీయ వ్యతిరేకతలు అమరావతికి ఆటంకంగా మారుతున్నాయి.పార్లమెంటు ఆమోదం ఉన్నా, రాష్ట్ర స్థాయిలో అమలుకు అనేక సాంకేతిక, న్యాయపరమైన అంశాలు ఉన్నాయి. భూమి బదిలీలు, ప్రాజెక్ట్ ఫండింగ్, స్థానిక సంస్థల మంజూరు, వ్యవసాయ పరిష్కారాల అమలు వంటి పనులు అంతులేని కార్యయజ్ఞాలుగా మారతాయి. పెట్టుబడుల ప్రవాహం, మౌలిక వసతుల బహిర్గతత, ప్రభుత్వ లాజిస్టిక్స్ అన్ని సమన్వయం కావాలి. ఇదే సమయంలో రాజకీయ ఆందోళనలు, సహకారంతో కూడని పరిస్థితులు ఈ పనులను ఆలస్యం చేస్తాయి. అమరావతి నిర్మాణం వలన ఏర్పడే ప్రత్యక్ష ప్రయోజనాలు చాలా స్పష్టంగా కనిపిస్తాయి. స్థానిక ఉపాధి అవకాశాలు, దారిద్ర్య తగ్గింపు, నగరీకరణ ద్వారా సేవల అందుబాటు. అయితే ఈ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఆలస్యాలు, వివాదాలు ఎక్కవితే రైతుల ఆర్థిక భరోసా విచ్ఛిన్నం అవుతుందని భయంకరం. ప్రత్యేకంగా భూములను ఇచ్చిన రైతులు వారి జీవనాధారం మెరుగుపడుతుంది. రైతుల హక్కులు, పునరావాసం, పరిహారం, భవిష్య రక్షణ వంటి అంశాలు చట్టపరంగా భరోసా ఇవ్వాలి.అమరావతి నిర్మాణం ప్రజల ఆశలు, ఆశయాలతో కూడిన సంకల్పం. రాజకీయ ప్రయోజనాల కోసం దీనిని సంక్లిష్టం చేయడం బాధాకరం. రాజధాని ఇబ్బందులను రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటూ రాష్ట్రాన్ని ఇంకా ఎంతకాలం రాజధాని లేకుండా చేస్తారు. ఇప్పటికైనా ప్రజల్లో మార్పు రావాలి. రాజధాని కోసం అందరూ ఏకం కావాలి. తెలంగాణ తరహాల్లో ఐక్యంగా ముందుకు సాగాలి. అమరావతి నిలబడాలంటే నాయకత్వం పారదర్శకంగా, నిబద్ధతతో, ప్రజా ఆశల ప్రకారం ఆచరణలో కనిపించాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# వియత్నాంలో బోటు బోల్తా.. 15 మంది మృతి.. మృతుల్లో ఏపీ వాసులు



వియత్నాం పర్యటనకు వెళ్లిన భారతీయ పర్యాటకులకు ఊహించని విషాదం ఎదురైంది. ప్రముఖ పర్యాటక ప్రాంతమైన ఫూ క్వాక్ ద్వీపం సమీపంలో భారతీయులు ప్రయాణిస్తున్న ఒక స్పీడ్‌బోటు ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘోర దుర్ఘటనలో ఇప్పటివరకు 15 మంది భారతీయ పర్యాటకులు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం అందుతోంది. మృతుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు ఉండటంతో తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి.

**మృతుల్లో ఏపీ డిస్ట్రిబ్యూటర్లు.. ఒడ్డున ఉండి బతికిన మరో వ్యక్తి**

ఈ ప్రమాదంలో మరణించిన వారిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరిని అధికారులు గుర్తించారు. కడప జిల్లాకు చెందిన ప్రముఖ మొబైల్ కంపెనీ డిస్ట్రిబ్యూటర్ శ్రీధర్, అలాగే కృష్ణా జిల్లా మచిలీపట్నంకు చెందిన జయశ్రీ ఈ ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. కాగా కడపకే చెందిన నయీం అనే మరో మొబైల్ డిస్ట్రిబ్యూటర్ ప్రమాద సమయంలో బోటు ఎక్కకుండా ఒడ్డునే ఉండిపోవడంతో తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.

**మొబైల్ కంపెనీ టూర్.. అసలేం జరిగింది?**

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఒక ప్రముఖ మొబైల్ సంస్థ తమ భారతీయ డిస్ట్రిబ్యూటర్లు, వారి కుటుంబ సభ్యుల కోసం ప్రత్యేకంగా ఈ వియత్నాం విహార యాత్రను ఏర్పాటు చేసింది. ఈ టూర్‌లో దేశవ్యాప్తంగా మొత్తం 250 మంది పాల్గొన్నారు. వీరిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు 35 మంది, తెలంగాణకు చెందిన వారు 40 మంది ఉన్నారు. పర్యటనలో భాగంగా పర్యాటకులను మూడు వేర్వేరు బోట్లలో సముద్ర విహారానికి తీసుకెళ్లారు. మధ్యాహ్నం సమయంలో 'హాన్ మే రుట్' ప్రాంతం నుంచి 'అన్ థోయ్ పోర్టు' వైపు 32 మంది భారతీయ పర్యాటకులు, నలుగురు సిబ్బందితో ఒక స్పీడ్‌బోటు బయల్దేరింది. అయితే తీరానికి సుమారు 400 మీటర్ల దూరంలోకి చేరుకున్న సమయంలో ఒక్కసారిగా బోటు అదుపుతప్పి సముద్రంలో తలకిందులైంది. దీంతో బోటులోని వారంతా నీటిలో మునిగిపోయారు.

**వాతావరణ మార్పే కారణమా?**

వాతావరణం ఒక్కసారిగా మారిపోవడం, సముద్రంలో అలల ఉద్ధృతి తీవ్రం కావడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని స్థానిక అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే సమీపంలోని ఇతర పర్యాటక బోట్ల సిబ్బంది స్పందించి రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించారు. బోటు పూర్తిగా తలకిందులు కావడం, అలల వేగం ఎక్కువగా ఉండటంతో సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అయినప్పటికీ పలువురిని సురక్షితంగా బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. మరికొందరు ఇంకా గల్లంతవడంతో వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

**రంగంలోకి భారత రాయబార కార్యాలయం**

ఈ దారుణ ఘటనపై వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం తక్షణమే స్పందించింది. బాధితులకు అవసరమైన అన్ని రకాల వైద్య, అత్యవసర సహాయాన్ని అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. స్థానిక రెస్క్యూ బృందాలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. బాధితుల కుటుంబ సభ్యుల సమాచారం కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను కూడా ఏర్పాటు చేశారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతుండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

# 'మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్-2026' జాబితాలో నారా బ్రాహ్మణి.. చంద్రబాబు, లోకేష్, బాలయ్య హర్షం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోడలు, ప్రముఖ డైరీ రంగ సంస్థ 'హెరిటేజ్ ఫుడ్స్' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణికి అంతర్జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక గుర్తింపు లభించింది. ప్రముఖ బిజినెస్ మ్యాగజైన్ 'ఫార్చ్యూన్ ఇండియా' తాజాగా విడుదల చేసిన '100 మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్-2026' జాబితాలో ఆమె స్థానం సంపాదించారు. దేశ ఆర్థికాభివృద్ధికి, పారిశ్రామిక రంగానికి మహిళా పారిశ్రామికవేత్తలు అందిస్తున్న విశేష సేవలను గుర్తిస్తూ ఫార్చ్యూన్ ఇండియా ఏటా ఈ జాబితాను ప్రకటిస్తుంది. ఈ ఏడాది ఈ ప్రతిష్టాత్మక జాబితాలో నారా బ్రాహ్మణి చోటు దక్కించుకోవడం తెలుగు రాష్ట్రాలకు గర్వకారణంగా నిలిచింది.

**ఢిల్లీలో అవార్డు ప్రదానం.. రైతులకు అంకితం**

దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో నారా బ్రాహ్మణి ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెరిటేజ్ ఫుడ్స్ సాధించిన ఈ విజయ ప్రయాణంలో రైతుల పాత్రే అత్యంత కీలకమైనదని కొనియాడారు. "రైతుల నిరంతర కృషి, అంకితభావం వల్లే హెరిటేజ్ ఫుడ్స్ ఈ రోజు ఈ స్థాయికి చేరుకుంది. రైతు లబ్ధిదారుల ఆదాయాన్ని పెంచడం, వారి జీవనోపాధిని మరింత మెరుగుపరచడమే మా సంస్థ యొక్క ప్రధాన లక్ష్యం. నాకు దక్కిన ఈ అరుదైన గౌరవాన్ని హెరిటేజ్ ఫుడ్స్ కుటుంబ సభ్యులతో పాటు, మాతో కలిసి నడుస్తున్న లక్షలాది మంది రైతులకు అంకితం చేస్తున్నాను" అని హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి తెలిపారు.

**చంద్రబాబు, లోకేష్, భువనేశ్వరి అభినందనల జల్లు**

నారా బ్రాహ్మణి సాధించిన ఈ అద్భుత ఘనతపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా వేదికగా హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు ట్వీట్ చేస్తూ "ఈ గుర్తింపు బ్రాహ్మణి నాయకత్వ లక్షణాలు, అంకితభావం, దూరదృష్టి మరియు నిబద్ధతకు నిదర్శనం. భవిష్యత్తులో ఆమె మరిన్ని మైలురాళ్లను అధిరోహించాలి. ముఖ్యంగా తెలుగు యువతకు, మహిళలకు బ్రాహ్మణి ఒక గొప్ప స్ఫూర్తిగా నిలుస్తారు" అని ఆకాంక్షించారు. మంత్రి నారా లోకేష్ తన భార్య సాధించిన విజయానికి గర్విస్తూ ఎక్స్ వేదికగా ప్రత్యేక సందేశాన్ని పోస్ట్ చేశారు. దేశంలోని అత్యంత ప్రభావవంతమైన మహిళా పారిశ్రామికవేత్తల్లో ఒకరిగా బ్రాహ్మణి గుర్తింపు పొందడం ఎంతో గర్వకారణమని, ఆమె సమర్థ నాయకత్వంలో సంస్థ మరిన్ని ఉన్నత శిఖరాలను తాకాలని ఆకాంక్షించారు.నారా భువనేశ్వరి కూడా స్పందించారు. బ్రాహ్మణికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ.. ఈ అరుదైన గౌరవం ఆమె దృఢ సంకల్పానికి, దూరదృష్టితో కూడిన నాయకత్వానికి దక్కిన ప్రతిఫలమని ప్రశంసించారు.

**బాలయ్య పుత్రికోత్సాహం**

ఫార్చ్యూన్ ఇండియా 100 మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ 2026 జాబితాలో చోటు దక్కించుకున్న నారా బ్రాహ్మణికి ప్రముఖ నటుడు, బ్రాహ్మణి తండ్రి బాలకృష్ణ అభినందనలు తెలిపారు. కష్టపడి సాధించిన విజయానికి గుర్తింపుగా లభించిన ఈ గౌరవం ఆమె అంకితభావం, పట్టుదల, నాయకత్వ లక్షణాలకు నిదర్శనమని పేర్కొన్నారు.తన కృషితో సమాజంపై సానుకూల ప్రభావం చూపుతూ, యువతులు పెద్ద కలలు కనేందుకు, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు బ్రాహ్మణి స్ఫూర్తిగా నిలుస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని ఆశిస్తూ తన ఆశీస్సులు, శుభాకాంక్షలు ఎల్లప్పుడూ ఉంటాయని బాలకృష్ణ తెలిపారు.

**హెరిటేజ్ ఫుడ్స్ ప్రగతిలో కీలక పాత్ర**

హెరిటేజ్ ఫుడ్స్ సంస్థను ఆధునిక వ్యాపార విధానాలతో, అంతర్జాతీయ ప్రమాణాలతో ముందుకు తీసుకెళ్లడంలో నారా బ్రాహ్మణి కీలక పాత్ర పోషిస్తున్నారు. కేవలం వ్యాపార విస్తరణే కాకుండా.. రైతు సంక్షేమం, నాణ్యమైన పాల ఉత్పత్తుల సరఫరా, స్థిరమైన వ్యవసాయాభివృద్ధి పై ఆమె ప్రత్యేక దృష్టి సారించారు. ఆమె నాయకత్వ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి సంస్థ దేశవ్యాప్తంగా తన మార్కెట్‌ను మరింత బలోపేతం చేసుకుంటూ దూసుకుపోతోంది.ఫార్చ్యూన్ ఇండియా 'మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్-2026' జాబితాలో నారా బ్రాహ్మణి నిలవడం కేవలం ఒక సంస్థకు దక్కిన గౌరవం మాత్రమే కాదు, భారతీయ వ్యాపార రంగంలో మహిళా శక్తి మరింత బలపడుతోందనడానికి ఇది ఒక స్పష్టమైన నిదర్శనమని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ విజయం నవతరం మహిళా పారిశ్రామికవేత్తలకు ఎంతో ప్రేరణనిస్తుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

# సొంత పార్టీలో తమ్ముడి సౌండ్

తెలుగుదేశం పార్టీ అంటే క్రమశిక్షణ అన్నది ప్రధానంగా అంతా మాట్లాడుకుంటారు. వర్గ పోరు కానీ సొంత పార్టీలో సౌండ్ చేయడం లాంటి చర్యలను కానీ పెద్దగా ఉపేక్షించేది ఉండదు. అయితే అన్నీ తెలిసిన సీనియర్ తమ్ముడు ఒకరు ఇటీవల కాలంలో చేస్తున్న హడావుడి పార్టీలో పెద్ద ఎత్తున చర్చగా సాగుతోంది. విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గానికి చెందిన కర్రోతు బంగారు రాజు బలమైన సామాజిక వర్గానికి చెందిన నేత. పలుకుబడి దండీగా ఉంది. మండల పరిషత్ అధ్యక్షుడిగా గతంలో పనిచేసిన అనుభవం ఉంది. ప్రస్తుతం ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్ గా కొనసాగుతున్నారు. ఆయనకు ఎమ్మెల్యే సీటు దక్కాల్సి ఉంది. 2024 లో కూటమి పార్టీలతో పొత్తు వల్ల అనేక సమీకరణల నేపథ్యంలో చాన్స్ జనసేనకు వెళ్ళింది. ఆనాడు ఆయనకు ఎమ్మెల్సీ ఇస్తామని అధినాయకత్వం ప్రామిస్ చేసింది అని అంటారు. కానీ చివరికి దక్కింది నామినేటెడ్ పదవి అన్న బాధ అయితే ఉందిట. ఇక బంగార్రాజు గురించి ఎందుకు ఇపుడు అంతగా చర్చ అంటే తాజాగా భోగాపురం విమానాశ్రయం పనులు పూర్తి అయిన సందర్భంగా ఒక్కసారి అక్కడికి వెళ్ళి ఫైనల్ గా సమీక్షను చేశారు కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు. ఈ సందర్భంగా ఆయన నిర్వహించిన సమావేశంలో ప్రోటోకాల్ ప్రకారం బంగార్రాజుకు పాల్గొనే అవకాశం వచ్చింది. ఈ సందర్భంగా ఆయన స్థానికులకు ఉద్యోగాల సంగతేంటి అని కేంద్ర మంత్రినే నిలదీశారు. మీరు ఇలా వచ్చి అలా వెళ్ళిపోతారు కానీ మేము జనాలకు జవాబు చెప్పుకోవాలి అంటూ బంగార్రాజు మాట్లాడిన తీరు అక్కడ ఉన్న వారిని సైతం ఆశ్చర్యానికి గురి చేసింది అంటున్నారు. సొంత పార్టీకి చెందిన కేంద్ర మంత్రిని అదే పార్టీకి చెందిన స్థానిక నేత ఈ విధంగా నిలదీయడం అంటే ఆలోచించాల్సిందే అంటున్నారు. ఇక విజానగరం జిల్లాలో జరిగే డీఆర్సీ సమావేశంలో కూడా ఈ విధంగానే బంగార్రాజు గొంతు పెంచి ప్రజా సమస్యల పేరుతో అధికారులను గట్టిగానే

నిలదీయడం చేస్తున్నారు అని అంటున్నారు. అంతే కాదు నెల్లిమర్ల పంచాయతీ సమావేశంలో కూడా తన అధికార హవాను ఆయన గట్టిగానే చూపించారు అని అంటున్నారు. దీంతో పాటు ఆయన నెల్లిమర్ల జనసేన ఎమ్మెల్యే లోకం మాధవితో సమాంతరంగా అధికార దర్పం చాటుకుంటున్నారు అని ప్రచారం సాగుతోంది. ఎమ్మెల్యే వర్సెస్ టీడీపీ అన్నట్లుగా ఉంటుంది. దాంతో ఇక్కడ కూటమిలో వర్గ పోరు సాగుతోంది అని అంటున్నారు. బంగార్రాజుకు జనంలో పలుకుబడి ఉంది. ఆయన స్థానికంగా గట్టి నాయకుడే. స్థానికుల డిమాండ్లను అధికారుల మంత్రుల ముందు పెట్టి చేయించుకుంటారు అని అంటున్నారు. కానీ సొంత పార్టీ నేతలను కేంద్ర రాష్ట్ర మంత్రులను ఇరకాటంలో పెట్టే విధంగా ఆయన వ్యవహరిస్తున్న తీరు మాత్రం చర్చనీయాంశం అవుతోంది. తాను ఎమ్మెల్యే స్థాయి నేతను అని చాటుకునేందుకు తన ఇమేజ్ ని పెంచుకునేందుకు ఇలా చేస్తున్నారు అని సొంత పార్టీలో గుసగుసలు పోతున్నారు. తనకు ఇలాగైతేనే మంచి గుర్తింపు లభిస్తుందని తన హవా ఎంటో పెద్దలకు తెలుస్తుందని ఆయన భావిస్తున్నారు అని అంటున్నారు. అయితే ఈ విధంగా అతి చేస్తే రేపటి రోజున ఇబ్బందులు కూడా వస్తాయని అంటున్నారు. పార్టీ అన్నింటి కన్నా క్రమశిక్షణకే పెద్ద పీట వేస్తుందని కూడా గుర్తు చేస్తున్నారు పార్టీ నేతలు. మరి బంగార్రాజు 2029 ఎమ్మెల్యే కావాలనుకుంటే ఈ హడావుడి అవసరమా అన్న ప్రశ్నలు అయితే పసుపు పార్టీలో వస్తున్నాయి

# ఏపీలో మరో కూటమి




ఏపీలో మరో కూటమి అవతరించనుందా? వచ్చే ఎన్నికల నాటికి ప్రస్తుతం ఉన్న కూటమికి పోటీగా ఇది మారనుందా? అంటే.. ఔననే సమాధానమే వినిపిస్తోంది. 2024 ఎన్నికల సమయంలో కూటమి కట్టిన టీడీపీ, బీజేపీ, జనసేనలు ఐక్యంగా ముందుకు సాగుతున్నాయి. పైగా వచ్చే ఎన్నికల్లోనూ అంతే బలంగా ముందుకు సాగాలని కూటమి నిర్ణయించుకుంది. దీంతో ప్రస్తుతం ఉన్న కూటమి యేతర

పార్టీలు ఒంటరి పోరాటం కంటే కలిసి నడిస్తేనే బెటర్ అన్న ఆలోచనకు వచ్చినట్టు గత కొన్నాళ్లుగా రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది కమ్యూనిస్టుల చొరవ ప్రత్యేకంగా కొత్త కూటమి కట్టే విషయంలో కమ్యూనిస్టులు చొరవ చూపిస్తున్నారు. రాష్ట్ర విభజన కు ముందు... కమ్యూనిస్టులకు కొన్ని నియోజకవర్గాల్లో ప్రాబల్యం ఉంది. అయితే.. విభజన తర్వాత.. తెలంగాణలో పట్టు నిలుపుకొన్నప్పటికీ.. ఏపీలో

కోల్పోయారు. సీపీఐ, సీపీఎంలు ఇప్పటి వరకు జరిగిన 2014, 2019, 2024 ఎన్నికల్లో పోటీ చేయడమే తప్ప.. గెలిచిందే లేదు. 2019లో జనసేనతో పొత్తు పెట్టుకున్నా.. ఫలితం దక్కలేదు. ఈ నేపథ్యంలో ఎన్నికలకు రెండేళ్ల ముందే కూటమి కట్టే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. కలిసొచ్చే పార్టీలను కమ్యూనిస్టులు రహస్యంగా కలుస్తున్నారని తెలుస్తోంది. ప్రధానంగా వైసీపీ నేతలను ఓ కీలక కమ్యూనిస్టు, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నాయకుడు కలిశారని.. పొత్తు పెట్టుకు ని ముందుకు వెళ్దామని ఆయన సూచించినట్టు వైసీపీ వర్గాల్లోనూ చర్చ జరుగుతోంది.

జగన్‌కు సన్నిహితుడై న సదరు నేత సూచనలను వైసీపీ కూడా పరిగణనలోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న కూటమిని చీల్చే ప్రయత్నం చేసినా.. అది ఫలించలేదు. ఈ నేపథ్యంలో తాము

కూడా ఓ కూటమిగా ముందుకు వెళ్లేందుకు జగన్ కూడా సుముఖంగానే ఉన్నారని వైసీపీ నాయకులు తరచుగా చెబుతున్నారు. "ఒంటరి ప్రయాణం మంచిదే. అయితే..కూటమిగా వెళ్తే మరింత తేలికగా.. విజయం దక్కించుకోవచ్చు" అని కృష్ణా జిల్లా కు చెందిన మాజీ మంత్రి ఒకరు వ్యాఖ్యానించారు. ఇక, ఈ కూటమిలో కాంగ్రెస్ కూడా ఉంటుందన్న టాక్ వస్తోంది. అయితే.. కాంగ్రెస్ పార్టీ ఈ కూటమిలో ఉంటే వైసీపీ ఉండదని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఇక, చిన్న చితకా పార్టీలు.. కూడా చేతులుకలిపి కొత్త కూటమి ఏర్పాటుకు ముందుకు వస్తున్నాయన్నది రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతున్న చర్చ.

మరి ఏం జరుగుతుంది? ఈ కూటమి ఏర్పడుతుందా? లేదా? అనేది కొన్నాళ్లు వెయిట్ చేసి చూడాల్సిందే.

# త్వరలో బంగ్లాకు వెళ్తా...

బంగ్లాదేశ్ మాజీ ప్రధాన మంత్రి, అవామీ లీగ్ పార్టీ నాయకురాలు షేక్ హసీనా సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను స్వదేశానికి వెళ్లి న్యాయస్థానం ఎదుట లొంగిపోయేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. తన ప్రాణాలకు ముప్పు ఉన్నప్పటికీ.. మాతృదేశానికి వెళ్లే ఆలోచనలో ఉన్నానని ఆమె చెప్పారు. రాయిటర్స్ వార్త సంస్థకు ఇచ్చిన టెలిఫోన్ ఇంటర్వ్యూలో హసీనా ఈ వ్యాఖ్యలు చేశారు. అరెస్టుకు లేదా చావడానికైనా తాను సిద్ధంగా ఉన్నానని బంగ్లాదేశ్ మాజీ ప్రధాని పేర్కొన్నారు. అయితే, ఈ విషయంపై ప్రస్తుత బంగ్లాదేవ్ ప్రభుత్వంతో ఎలాంటి సంప్రదింపులు జరపలేదని ఆమె ఉద్ఘాటించారు."స్వదేశానికి వెళ్లిన తర్వాత నన్ను వాళ్లు అరెస్టు చేయొచ్చు.. ప్రాణాలు తీసే అవకాశమూ ఉంది.. తీవ్ర అణచివేతకు గురువుతోన్న నా పార్టీ నేతలు, కార్యకర్తల కోసం నేను వెళ్లి తీరాలి.. ఒకవేళ మరణమే తథ్యమైతే నా తల్లిదండ్రులను సమాధి చేసిన చోట, నా సొంత గడ్డపైనే చనిపోవాలని కోరుకుంటున్నా" అని షేక్ హసీనా స్పష్టం చేశారు. ఏదేమైనప్పటికీ వచ్చే డిసెంబరులో తనతో పాటు అవామీ లీగ్ పార్టీ సీనియర్ నేతలు బంగ్లాదేశ్‌కు వెళ్లి కోర్టుల్లో లొంగిపోవాలని నిర్ణయానికి వచ్చామని చెప్పారు. అయితే, తన అప్పగింతపై భారత్‌కు బంగ్లా నుంచి అనేక లేఖలు రాస్తున్నారని.. ఈ నేపథ్యంలోనే వెళ్లాలని నిర్ణయం తీసుకున్నానని ఆమె పేర్కొన్నారు.రిజర్వేషన్లకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్ యువత జులై 2024లో చేపట్టిన ఉద్యమం హింసాత్మకంగా మారి.. చివరకు షేక్ హసీనా పదవికి ఎసరు తెచ్చాయి. అదే ఏడాది ఆగస్టు 5న రాజీనామా చేసిన దేశం విడిచి భారత్‌కు పారిపోయిన వచ్చిన షేక్ హసీనా ఇక్కడే ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. అయితే, యువత నిరసనలను అణచివేయడంలో హసీనా పాత్ర ఉందని ఆరోపిస్తూ అనేక కేసులు నమోదయ్యాయి. అయితే, ఈ ఆరోపణలను హసీనా తోసిపుచ్చారు. కానీ, బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ మాత్రం విచారణ చేపట్టి ఆమెకు గతేడాది మరణశిక్ష విధించింది.ఇటీవల మీడియాతో తాను స్వదేశానికి వెళ్లేందుకు సిద్ధమేనని షేక్ హసీనా చెప్పినప్పటికీ.. ఎప్పుడు వెళ్తారనేది మాత్రం ఇప్పుడే అధికారికంగా స్పష్టత ఇచ్చారు. ఇదిలాఉంటే, మాజీ ప్రధానిని అప్పగించాలని మొహమ్మద్ యూనస్ నాయకత్వంలోని మధ్యంతర ప్రభుత్వంతో పాటు ఇటీవల ఎన్నికల అనంతరం ఏర్పడిన తారిక్ రెహమాన్ నేతృత్వంలోని బీఎన్పీ సర్కారు భారత్‌ను పలుసార్లు కోరాయి. ఈ అంశంపై న్యాయపరమైన విషయాలను పరిశీలిస్తున్నట్లు కేంద్రం ప్రకటించిన విషయం తెలిసిందే.అయితే, తనపై పెట్టిన కేసులను రాజకీయ ప్రేరేపితమైనవిగా అభివర్ణించిన షేక్ హసీనా.. న్యాయపరమైన విచారణలో ఇది బయటపడుతుందని నమ్ముతున్నందుకే లొంగిపోవాలని భావిస్తున్నట్లు హసీనా చెప్పారు. "నేను న్యాయాన్ని నమ్ముతాను, విచారణ మొదలయ్యాక కోర్టు ఎంత హాస్యాస్పదంగా ఉందో ప్రజలకు స్పష్టమవుతుందని నేను భావిస్తున్నాను.. దాన్ని నేను నిరూపించాలనుకుంటున్నాను" అని ఆమె అన్నా

రు. తనపై బనాయించిన కేసులు రాజకీయ ప్రేరేపితమైనవని హసీనా పేర్కొన్నారు. ఈ ఏడాది ఆరంభంలో ఆమెతో పాటు మరో 112 మందిపై పెట్టిన హత్యాయత్నం కేసును రద్దుచేయాలని బంగ్లాదేశ్ పోలీస్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో సిఫార్సు చేసిన నేపథ్యంలో ఈ విషయంలో మరింత స్పష్టమైంది.అరెస్ట్‌లు, జైలుకు తాను ఆందోళన చెందడం లేదని ఆమె అన్నారు. తనకు జైలు జీవితం కొత్తకాదని, రాజకీయ జీవితంలో అనేకసార్లు జైలుకు వెళ్లొచ్చానని హసీనా తెలిపారు. మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం నిషేధించిన అవామీ లీగ్‌ను పునర్వ్యవస్థీకరించే ప్రయత్నాలలో భాగంగా బంగ్లాదేశ్‌లోని 300 పార్లమెంటరీ నియోజకవర్గాలలో 125 నియోజకవర్గాలలో తాను ఆన్‌లైన్ సమావేశాలు నిర్వహిస్తున్నానని ఆమె చెప్పారు. అయితే, తన 20 ఏళ్ల పదవీ కాలాన్ని సమీక్షిస్తూ పొరపాట్లు జరిగి ఉండొచ్చని అంగీకరించిన హసీనా.. అంతిమ తీర్పు బంగ్లాదేశ్ ప్రజలదేనని ఆమె నొక్కి చెప్పారు.

# సింగపూర్ కు తిరుపతి మామిడి...

ఆంధ్ర మామిడి పండ్ల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఒక్కో ప్రాంతానికి ఒక్కో రకం ఫేమస్. నూజివీడు రసాలు, ఉలవపాడు మామిడికాయ, చిత్తూరు తోతాపురి, ఇక బంగినపల్లి గురించయితే అస్సలు చెప్పాల్సిన అవసరం లేదు. ప్రపంచ వ్యాప్తంగా మన మామిడి పండ్లకి యమా గిరాకీ ఉంది. తాజాగా సింగపూర్‌కు మన మామిడి పండ్లను టన్నుల కొద్దీ ఎగుమతి మొదలైంది. సీఎం చంద్రబాబు నాయుడు నియోజకవర్గం నుంచే ఈ ఎగమతి మొదలవ్వడం విశేషం.చిత్తూరు జిల్లాలో తోతాపురి, బంగినపల్లి మామిడి కాయలు ఎక్కువ కాపు కాస్తాయి. కర్ణాటక పరిధిలోని చింతామణి ప్యాక్ హౌస్ నుంచి ఐదు టన్నుల మామిడి పండ్లతో ఉన్న కంటైనర్ చెన్నై ఓడరేవుకు బయల్దేరింది. భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ, సీఐఎస్‌హెచ్ సహకారంతో బంగినపల్లి, తోతాపురి మామిడి పండ్లను నౌక ద్వారా సింగపూర్‌కు పంపుతున్నట్లు ఓసమ్ ఫుడ్స్ డైరెక్టర్ వ్యవసాయ పారిశ్రామికవేత్త కోటేశ్వరరావు తెలిపారు.కుప్పం నియోజకవర్గంలోని మండలాలతో పాటు పలమనేరు

నియోజకవర్గంలోని వి.కోట మండల రైతుల నుంచి సేకరించిన మామిడిని సింగపూర్‌కు పంపినట్లు వారు తెలిపారు. ఈ మామిడి పండ్లను మొత్తాన్ని ఓ కంటైనర్‌లో ఉంచి, షిప్‌లో సింగపూర్‌కు పంపుతున్నారు. మామిడి పండ్లు సింగపూర్‌కి చేరుకోవడానికి 12 రోజుల సమయం పడుతుంది. ఈ 12 రోజుల పాటు మామిడి పండ్లు చెడిపోకుండా ఉండేవిధంగా 12 డిగ్రీల సెల్షియస్‌తో వాటిని జాగ్రత్తగా భద్రపరుస్తారు.రైతుల దగ్గర నుంచి మేలిమిజాతి మామిడి పండ్లను మంచి ధరకే కొనుగోలు చేసినట్లు వ్యాపారులు తెలిపారు. కిలో తోతాపురి

రూ. 50, బంగినపల్లి కిలో రూ. 120 చొప్పున కొనుగోలు చేశారు. గత నెల 9న ఐదు టన్నుల బంగినపల్లి మామిడిని సింగపూర్‌కు పంపగా.. రవాణా, ఇతర ఖర్చులు పోనూ కిలోకు రూ. 40 మిగిలిందని తెలిపారు. ప్రస్తుతం కర్ణాటక పరిధిలోని ప్యాక్ హౌస్ నుంచి పంపిం చాల్సి వస్తుందని.. అదే ప్యాక్ హౌస్ కుప్పం ప్రాంతం లో ఉంటే చిత్తూరు జిల్లా నుంచి విదేశాలకు మంచి మామిడిపండ్లు పంపే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు.

సమస్య ఎంత జటిలమైతే, ప్రజలు అంత సరళమైన పరిష్కారానికి తహతహలాడతారు. ఇది సహజ లక్షణం! కానీ జటిల సమస్యలకు సరళ పరిష్కారాలు దొరకవు; దొరికినట్టు కనిపించే పరిష్కారాలు తరచూ కొత్త సమస్యలకు బీజాలు వేస్తాయి. సోషల్ మీడియావల్ల టీనేజర్ల మానసిక ఆరోగ్యం దెబ్బతింటోందా? దాన్ని అరికట్టేందుకు ఏం చేయాలనే ప్రశ్న ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు, పరిశోధకులు, తల్లిదండ్రులను వేధిస్తున్న జటిల సమస్యే. కొన్నేళ్లుగా పలు దేశాల్లో ఈ వేదికలు యుక్తవయస్కుల్లో మానసిక ఆరోగ్య సంక్షోభాన్ని రాజేస్తున్నాయనే భావన బలంగా వేళ్లూనుకుంది. అయితే ఈ భావనలో ఎంత భాగం నిజంగా 'కారణం–ఫలితం' బంధమో, ఏ పరిస్థితుల్లో హాని జరుగుతుందో ఇంకా శాస్త్రీయ చర్చలోనే ఉంది. ఈ నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇటీవల ఆస్ట్రేలియా నిర్ణయాన్ని ప్రశంసించడం గమనార్హం. 2024లో ఆస్ట్రేలియా 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా వినియోగాన్ని నిషేధించింది. భారత్‌లోనూ అలాంటి నిషేధం రాబోతోందనడానికి మోదీ మాటలు సంకేతం కావొచ్చు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు ఇప్పటికే ఈ దిశగా ఆలోచనలు చేశాయి. కానీ ఆసక్తికరమైన విషయం–ఆస్ట్రేలియాకు చెందిన మనస్తత్వ శాస్త్రవేత్తలు, డిజిటల్ ఆరోగ్య పరిశోధకులు, బాలల హక్కుల నిపుణులు, ఆన్‌లైన్ భద్రతా నిపుణులు నిషేధ చట్టాన్ని తీవ్రంగా విమర్శించారు. సోషల్ మీడియా వాడకం వల్ల పిల్లలకు హాని జరుగుతుందనడానికి విశ్వసనీయమైన ఆధారాలున్నా.. వయసు ఆధారిత నిషేధం విధిస్తే మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందనడానికి ఎలాంటి ఆధారాలు లేవన్నది వారి వాదన. నిజానికి ఆస్ట్రేలియా ఒక 'సహజ ప్రయోగం' నిర్వహిస్తోందనే చెప్పాలి. ఆ ప్రయోగపు తొలి ఫలితాలు నిషేధవాదులకు నిరుత్సాహం కలిగించేవే. నిషేధం అమల్లో ఉన్నప్పటికీ 12–16 ఏళ్ల వయసు పిల్లల్లో సుమారు 85 శాతం ఇప్పటికీ సోషల్ మీడియా వేదికలను వాడుతున్నట్టు లెక్కలున్నాయి. అంటే చట్టం కాగితాలకే పరిమితమైంది; నిషేధం విఫలమవడమే కాదు –పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను చీకట్లోకి, పర్యవేక్షణలేని మూలల్లోకి నెట్టే ప్రమాదమూ ఉంది.

నిషేధాన్ని సమర్థించేవారి వాదననూ కొట్టిపారేయలేం. పరిపూర్ణమైన శాస్త్రీయ ఆధారాల కోసం ఎదురుచూస్తూ కూర్చుంటే, జరగరాని నష్టం జరిగాక ఏంచేయలేని పరిస్థితి ఎదురవుతుందన్నది వారి ఆందోళన. ఇందులోనూ నిజాయితీ ఉంది. ఇక్కడే.. మెజారిటీ నిపుణులు భిన్నమైన మార్గాన్ని సూచిస్తున్నారు. నిషేధాన్ని పక్కనపెట్టి, వేదికలపై 'సంరక్షణ బాధ్యత' (డ్యూటీ ఆఫ్ కేర్)ను కఠినంగా విధించాలి. పాఠశాల విద్యలో డిజిటల్ అక్షరాస్యతను భాగం చేయాలి. వినియోగదారులను వ్యసనపరులుగా మార్చే ఇంటర్‌ఫేస్ డిజైన్లను నియంత్రించాలి. మైనర్లకు అల్గారిథమ్ సిఫార్సుల బదులు కాలక్రమానుగత (క్రోనలాజికల్) ఫీడ్‌ను తప్పనిసరి చేయాలి. కంటెంట్ మోడరేషన్‌ను పటిష్ఠం చేయాలి. గోప్యతా రక్షణలను మెరుగుపరచాలి. సమర్థవంతమైన పేరెంటల్ కంట్రోల్స్‌ను ప్రవేశపెట్టాలి. ఈ సూచనల వెనుక బలమైన శాస్త్రీయ తర్కముంది. యుక్తవయస్కులపై సోషల్ మీడియా ప్రభావాన్ని అధ్యయనం చేసిన పరిశోధనల్లో అత్యధికం పరిశీలనాత్మక (అబ్జర్వేషనల్) అధ్యయనాలే. అలాంటి అధ్యయనాల్లో 'విలోమ కారణత్వం' అనే లోపం పొంచి

## డిజిటల్ కంచె!?

ఉంటుంది. అంటే సోషల్ మీడియా వాడకంవల్ల కుంగుబాటు రావడం కాకుండా, ఇప్పటికే కుంగుబాటులో ఉన్న టీనేజర్లు ఎక్కువ సమయం ఆన్‌లైన్‌లో గడుపుతుండవచ్చు. ఏది కారణమో, ఏది ఫలితమో తేల్చడం కష్టం. పైగా ఈ అధ్యయనాల్లో కనిపించిన సగటు ప్రభావాలు చాలా చిన్నవే. నిపుణులు మరో కీలకమైన అంశాన్నీ ఎత్తిచూపుతున్నారు: రోజుకు ఎన్ని గంటలు వాడుతున్నారన్నది కాదు అసలు ప్రశ్న. నిష్క్రియంగా స్క్రోల్ చేస్తూ కూర్చుంటున్నారా? లేక చురుగ్గా సంభాషణల్లో పాల్గొంటున్నారా; ఆదరించే, ప్రోత్సహించే సమూహాల్లో ఉన్నారా? లేక విషపూరితమైన, శత్రుపూరిత వాతావరణంలో చిక్కుకున్నారా? ఇవే హానిని నిర్ణయించే నిజమైన కొలమానాలు. అంటే సమస్య 'వాడకం'లో కాదు, 'వాడకపు తీరు'లో, 'వేదికల నిర్మాణం'లో ఉందన్నమాట. వయసు ఆధారంగా గేటు మూసేసే నిషేధం ఈ సూక్ష్మ భేదాలను పూర్తిగా విస్మరిస్తుంది.

నిజానికి సోషల్ మీడియా అనేది నాణేనికి రెండు ముఖాల్లాంటిది. అది నిద్రను చెడగొడుతుంది; సైబర్ వేధింపులకు ద్వారాలు తెరుస్తుంది; వ్యసనానికి బానిసలను చేసే సిఫార్సు అల్గారిథమ్‌లతో పిల్లలను గంటల తరబడి తెరకు అతికించి ఉంచుతుంది. ఇవన్నీ కాదనలేని చేదు నిజాలు. కానీ అదే సోషల్ మీడియా స్నేహాలను నిలబెడుతుంది. వ్యక్తిత్వాన్ని, గుర్తింపును అన్వేషించుకునే అవకాశమిస్తుంది; తోటివారి మద్దతు అందిస్తుంది; ఎల్‌జీబీటీక్యూఐఏం వంటి సమూహాలకు చెందిన పిల్లలకు తమలాంటివారితో అనుసంధానాన్ని, మానసిక ఆరోగ్య సమాచారాన్ని అందుబాటులోకి తెస్తుంది. ఒంటరితనంలో కూరుకున్న ఎందరో పిల్లలకు ఈ వేదికలే ఊపిరిపోశాయన్నదీ వాస్తవమే. నిషేధం విధిస్తే హానితోపాటు మేళ్లనూ కోల్పోతాం. కాబట్టి మొత్తం చిత్రం మిశ్రమంగా ఉంది; పరిష్కారాలు సరళంగా లేవు. భారత్‌లాంటి దేశానికి ఈ చర్చ మరింత కీలకం. ప్రపంచంలోనే అత్యధిక యువజనాభా ఉన్న దేశం మనది; ఇక్కడ డిజిటల్ వేదికలు విద్యకు, ఉపాధికి, సమాచారానికి ప్రధాన ద్వారాలుగా మారాయి. వయసు ధ్రువీకరణ కోసం ఆధార్ వంటి గుర్తింపు వ్యవస్థలను వాడితే గోప్యతకు కొత్త ముప్పులు తలెత్తుతాయి; అమలు చేయలేని చట్టం చేస్తే చట్టంపట్ల గౌరవమే తగ్గుతుంది. ఆస్ట్రేలియా అనుభవం మనకు నేర్పుతున్న పాఠం స్పష్టం: 85 శాతం మంది పిల్లలు నిషేధాన్ని దాటి లోపలికి వస్తున్నప్పుడు, గేటువద్ద కాపలా పెంచడం కాదు చేయాల్సింది.. లోపలి ప్రాంగణాన్ని సురక్షితం చేయడం. ప్రభుత్వాలు 'ఎవరు లోపలికి రావచ్చు' అని నియంత్రించే బదులు, 'వేదికలు ఎలా పనిచేయాలి' అన్నదాన్ని మార్చాలి. లాభార్జనే పరమావధిగా పిల్లల దృష్టిని క్షణక్షణం వేటాడే అల్గారిథమ్‌లను కట్టడి చేయడం, వేదికల జవాబుదారీతనాన్ని చట్టబద్ధం చేయడం, పిల్లలకూ తల్లిదండ్రులకూ డిజిటల్ విజ్ఞతను నేర్పడం.. ఇదే శాశ్వతమైన, శాస్త్రీయమైన మార్గం. తలుపులు మూయడం సులభం; ఇంటిని సురక్షితం చేయడం కష్టం. కానీ పిల్లల భవిష్యత్తు విషయంలో సులభమైన దారి కాదు, సరైన దారే మనం ఎంచుకోవాలి!

---

### పనికొచ్చే పలుకు



## చెరగని అందం.. మన వ్యక్తిత్వమే!

నేటి డిజిటల్ యుగంలో ప్రతి ఒక్కరినీ వేధిస్తున్న ప్రధాన సమస్య 'పర్ఫెక్షన్'. సోషల్ మీడియాలో అందంగా కనిపించాలి, ఇతరులకంటే మెరుగ్గా ఉండాలనే తాపత్రయంలో చాలామంది మానసిక ప్రశాంతతను కోల్పోతున్నారు. ఈ ఫిల్టర్ల ప్రపంచంలో బతుకుతున్న మనకు, హాలీవుడ్ ప్రముఖ నటి ఆన్ హాథ్‌వే చెప్పిన మాటలు కనువిప్పు కలిగిస్తున్నాయి. నిజమైన ఆనందం బాహ్య సౌందర్యంలో లేదు, మన అసలైన వ్యక్తిత్వంలోనే ఉంటుందని ఆమె గుర్తుచేశారు.

సాధారణంగా ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌వంటి సామాజిక మాధ్యమాల్లో ప్రతి ఒక్కరూ తమ జీవితంలోని ఉత్తమ క్షణాలను, ఎడిట్ చేసిన ఫోటోలను మాత్రమే షేర్ చేస్తుంటారు. సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్ల జీవనశైలితో తమను తాము పోల్చుకోవడంవల్ల చాలామందిలో అభద్రతాభావం పెరుగుతోంది. ఎల్లప్పుడూ అద్భుతంగా కనిపించాలనే ఈ ఒత్తిడి క్రమంగా ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తూ, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గత కొన్నేళ్లుగా బాడీ పాజిటివిటీ, మెంటల్ హెల్త్‌పై విస్తృత చర్చ జరుగుతున్న నేపథ్యంలో, ఆన్ హాథ్‌వే గతంలో పంచుకున్న కొన్ని ఆలోచనలు ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి.

నాటి ఆన్ హాథ్‌వే మాటలు.. నేటికీ ఆదర్శం

"నేను ఎప్పుడో పర్ఫెక్షన్ కోసం పోరాడటం మానేశాను. ఆ ఆలోచన నాకు ఇప్పుడు ఏమాత్రం ఆసక్తికరంగా అనిపించడం లేదు. ప్రతి ఒక్కరూ కేవలం ఫోటోల్లో అందంగా కనిపించడానికే ఆరాటపడుతున్నారు. అసలైన ఒత్తిడి అక్కడినుంచే మొదలవుతుందని నేను భావిస్తాను. సంతోషంగా ఉండండి. మీలా మీరు జీవించండి. జీవితంలో అంతకంటే చాలా పెద్ద విషయాలు ఉన్నాయి" అని బ్రెయిన్‌కోట్ వేదికగా ఆన్ హాథ్‌వే పేర్కొన్నారు.

ఈ హాలీవుడ్ స్టార్ మాటల వెనుక ఉన్న లోతైన అర్థాన్ని గమనిస్తే, మనం అనుకునే పర్ఫెక్షన్ అనేది ఒక నిరంతర భ్రమ మాత్రమే. ప్రతిదీ ఖచ్చితంగా ఉండాలని కోరుకోవడం మానసికంగా అలసటను కలిగిస్తుంది. సామాజిక మాధ్యమాల్లో కేవలం కొన్ని క్షణాల గుర్తింపు కోసం, లైకుల కోసం ఆరాటపడే క్రమంలో జీవితంలోని అసలైన అనుభూతులను కోల్పోతున్నామని ఆమె సున్నితంగా హెచ్చరించారు. ఫిల్టర్ల వెనుక దాక్కునే అందంకంటే, మన లోపాలను సైతం స్వీకరిస్తూ యథార్థంగా జీవించడమే గొప్ప విషయమని ఈ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

మానసిక ప్రశాంతతకు 'స్వీయ అంగీకారమే' కీలకం

పరిశోధనల ప్రకారం కూడా, ప్రతి విషయంలో పర్ఫెక్ట్‌గా ఉండాలనుకునే మనస్తత్వం తీవ్ర ఒత్తిడి, ఆందోళన, మానసిక అలసటకు దారితీస్తుంది. మనల్ని మనం ఉన్నదున్నట్లుగా అంగీకరించినప్పుడే జీవితంలో ఎదురయ్యే సవాళ్లను తట్టుకోగలమని నిపుణులు చెబుతున్నారు. ఏదైనా వేడుకకు హాజరైనా, కెరీర్‌లో ముందుకు సాగుతున్నా.. ఇతరులు ఏమనుకుంటారు? అనే ఆలోచన కంటే, మన మనసుకు నచ్చినట్లు ఉండటమే ఎంతో మేలు.

క్రిస్టోఫర్ నోలన్ సినిమాతో బిజీగా ఆన్ హాథ్‌వే

ఇక వృత్తిపరమైన విషయానికొస్తే, ఆన్ హాథ్‌వే ప్రస్తుతం ప్రపంచ ప్రఖ్యాత దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కిస్తున్న 'ది ఒడిస్సీ' చిత్రంలో నటించేందుకు సిద్ధమవుతున్నారు. ఒకవైపు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో బిజీగా ఉంటూనే, మరోవైపు సమాజానికి స్ఫూర్తినిచ్చేలా ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు నేటి యువతలో కొత్త ఆలోచనలను రేకెత్తిస్తున్నాయి. బాహ్య సౌందర్యం కంటే నిజమైన ఆత్మవిశ్వాసమే ఒక మనిషిని అందంగా మారుస్తుందని ఈ ఆస్కార్ నటి మాటలు మనకు మరోసారి గుర్తుచేస్తున్నాయి.

---

## సగం ఆకాశం..! సగమే న్యాయం?



భారత విశ్వవిద్యాలయ ప్రాంగణాల్లో ఒక నిశ్శబ్ద విప్లవం –తరగతి గదుల్లో ఆడపిల్లల సంఖ్య అబ్బాయిలతో సమానంగా చేరడం. అఖిల భారత ఉన్నత విద్యా సర్వే (ఏఐఎస్‌హెచ్‌ఈ) 2023–24 తాజా గణాంకాలు ఈ చారిత్రక మలుపును ధ్రువీకరిస్తున్నాయి. గత దశాబ్దంలో మహిళల నమోదు ఏకంగా 42 శాతం పెరిగింది. 2014–15లో 1.57 కోట్లుగా ఉన్న సంఖ్య 2023–24నాటికి 2.24 కోట్లకు చేరింది. అదేకాలంలో పురుషుల నమోదు 1.85 కోట్లనుంచి 2.26 కోట్లకు చేరింది; అంటే వారి వృద్ధి రేటు 22.16 శాతం మాత్రమే. మహిళలు ఈ వృద్ధి రేటును సునాయాసంగా అధిగమించి, దేశ ఉన్నత విద్యా నమోదును రికార్డుస్థాయిలో 4.5 కోట్లకు చేర్చడంలో చోదకశక్తిగా నిలిచారు. నేడు భారత విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లోని మొత్తం విద్యార్థుల్లో దాదాపు సగంమంది (49.7 శాతం) యువతులే. లింగ సమానత్వ సూచీ (జెండర్ ప్యారిటీ ఇండెక్స్) 1.08కి చేరడం అంటే –ప్రతి 100మంది యువకులకు 108మంది యువతులు ఉన్నత విద్యలోకి అడుగుపెడుతున్నారన్నమాట. ఇది సామాన్య విజయం కాదు; తరతరాల పోరాటాల ఫలితం. ముఖ్యంగా అణగారిన వర్గాల విషయంలో ఈ ఘనత మరింత విలువైనది. షెడ్యూల్డ్ కులాల్లో మహిళా నమోదు 51.4 శాతం, షెడ్యూల్డ్ తెగల్లో ఏకంగా 75.7 శాతం పెరిగింది. ఒకప్పుడు ఇంటి గడప దాటడమే గగనమైన సామాజిక వర్గాల ఆడపిల్లలు నేడు డిగ్రీ పట్టాల కోసం కళాశాల మెట్లెక్కుతున్నారంటే, అది విద్యా హక్కు చట్టాలు, స్కాలర్‌షిప్ పథకాలు, తల్లిదండ్రుల ఆలోచనా ధోరణుల్లో వచ్చిన మార్పుల సమష్టి ఫలం. కానీ ఈ గణాంకాల వెలుగుల మధ్యే ఒక చేదు నిజం దాగి ఉంది. నమోదు సంఖ్యలు ఎంత ఘనంగావున్నా, కళాశాల గేటు దాటిన తర్వాత ఉపాధి అవకాశాల మసకదనమే ఉంటే.. ఈ విజయమంతా పైపై మెరుగులాగే మిగిలిపోతుంది. తరగతి గదిలో సాధించిన సమానత్వం, కార్యాలయంలో కనిపించకపోతే –సాధించిన డిగ్రీలు అలంకారప్రాయమే. సో, గణాంకాలను ఉత్సవంగా జరుపుకుంటూనే, లోతుల్లోకి వెళ్లి చూడాల్సిన సమయమిది!

లోతుగా చూస్తే కనిపించే మొదటి అసమతుల్యత –చదువుల ఎంపిక. స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం) విద్యార్థుల్లో మహిళలు 44 శాతం ఉన్నారన్నది నిజమే; కానీ ఈ సంఖ్య 'ఎస్' అక్షరం వైపు –అంటే జీవశాస్త్రం, రసాయన శాస్త్రంవంటి సంప్రదాయ సైన్సుల వైపు భారీగా ఒరిగి ఉంది. అక్కడ మహిళలు 54.6 శాతంతో మెజారిటీగా ఉన్నారు. కానీ భవిష్యత్ ఆర్థిక వ్యవస్థను నడిపించే ఇంజినీరింగ్, టెక్నాలజీ రంగాల్లో మాత్రం వారి వాటా కేవలం 31.1 శాతమే. ఆ రంగాలు నేటికీ పురుషాధిక్యంలోనే ఉన్నాయి. సంప్రదాయ సైన్సుల్లో గుమిగూడటం వల్ల మహిళలు కృత్రిమ మేధ, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ వంటి 'భవిష్యత్‌కు భరోసా ఇచ్చే' ఆర్థిక చోదక రంగాలకు దూరమవుతున్నారు. రేపటి ఉద్యోగ మార్కెట్‌ను ఏలబోయేది ఏఐ, డేటా సైన్స్, సాఫ్ట్‌వేర్ రంగాలే అయినప్పుడు, ఆ రంగాల ద్వారాల వద్దే మహిళల అడుగులు తగ్గిపోవడం ఆందోళనకరం. రెండో అసమతుల్యత –విద్యా సంస్థల అంతర్గత నిర్మాణంలో. విద్యార్థుల్లో 50–50 సమతూకం సాధించినా, బోధనా సిబ్బందిలో ప్రతి 100 మంది పురుష అధ్యాపకులకు కేవలం 82 మంది మహిళా అధ్యాపకులే ఉన్నారు. వైస్–ఛాన్సలర్లు, డైరెక్టర్లు, డీన్లువంటి అత్యున్నత నాయకత్వ స్థానాల్లో మహిళలు దాదాపు కనిపించరు. తరగతి గదిలో కూర్చున్న అమ్మాయికి పోడియం మీద, పాలనా పీఠాలమీద తనలాంటి వారు కనిపించకపోతే –'నేనూ అక్కడికి చేరగలను' అనే స్ఫూర్తి ఎక్కడి నుంచి వస్తుంది? విద్యా సంస్థలు ఇప్పటికీ పితృస్వామ్య నిర్మాణాలుగానే మిగిలిపోయాయనడానికి ఇదే నిదర్శనం. మూడో సమస్య –నాణ్యత. విద్యార్థుల వెల్లువ పెరిగిన కాలంలోనే ప్రైవేటు, నాసిరకం కళాశాలల సంఖ్య కూడా పేలుడులా పెరిగింది. వీటిలో అధ్యాపకుల తీవ్ర కొరత, పేలవమైన మౌలిక వసతులు సర్వసాధారణం. డిగ్రీ పట్టా చేతికందినా, నైపుణ్యాలు అందకపోతే ఆ చదువు ఉపాధి మార్కెట్‌లో నిలబడలేదు. ఈ మూడు అసమతుల్యతలూ కలిసి ఒక పెద్ద ప్రశ్నను లేవనెత్తుతున్నాయి... నమోదు గణాంకాల సంబరాల వెనుక, మనం నిజంగా ఆడపిల్లలకు సమాన అవకాశాల భవిష్యత్తును నిర్మిస్తున్నామా? లేక సంఖ్యల భ్రమలో మునిగి ఉన్నామా? అని!

ఈ ప్రశ్నకు అత్యంత కఠినమైన సమాధానం ఉపాధి గణాంకాల్లో దొరుకుతుంది. ఉన్నత విద్యకూ, సంఘటిత ఉద్యోగ మార్కెట్‌కూ మధ్య భారత్‌లో పెద్ద అగాధమే ఉంది. సామాజిక అంచనాలు, ఇంటి బాధ్యతల భారం, భద్రతా అవరోధాలు –వీటి కారణంగా మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు నేటికీ నిరాశాజనకంగానే ఉంది. 2025 పీఎల్‌ఎఫ్‌ఎస్ నివేదిక ప్రకారం.. క్రమబద్ధ వేతన ఉద్యోగాల్లో పురుషులదే ఆధిపత్యం. 26.5 శాతం పురుషులతో పోలిస్తే మహిళలు 18.2 శాతమే. సంపాదనలోనూ అంతరం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది: పురుషుల సగటు నెలవారీ ఆదాయం రూ.24,217 కాగా, మహిళలది రూ.18,353 మాత్రమే. ఇక 64.2 శాతం మహిళలు 'స్వయం ఉపాధి' కేటగిరీలో ఉన్నారని గణాంకాలు చెబుతున్నా, ఈ వర్గీకరణ అస్పష్టమైనది. ఇందులో వేతనం లేని ఇంటి పని, పొలం పనులు కూడా కలిసిపోయి ఉంటాయి. అంటే లెక్చర్ హాళ్ల నుంచి బయటికి వచ్చిన మహిళా గ్రాడ్యుయేట్లు నిజంగా ఎక్కడికి వెళ్తున్నారో ఈ గణాంకాలు చూపించలేకపోతున్నాయి. చదువుకున్న అమ్మాయి పెళ్లితో, పిల్లల పెంపకంతో, కుటుంబ ఒత్తిళ్లతో ఉద్యోగ మార్కెట్ నుంచి నిష్క్రమిస్తే –ఆమె డిగ్రీపై సమాజం పెట్టిన పెట్టుబడి అంతా వృథా. ఇది వ్యక్తిగత నష్టం మాత్రమే కాదు; జాతీయ ఆర్థిక నష్టం కూడా. మహిళా శ్రామిక భాగస్వామ్యం పెరిగితే జీడీపీ గణనీయంగా వృద్ధి చెందుతుందని ప్రపంచవ్యాప్త అధ్యయనాలు ఎప్పటి నుంచో ఘోషిస్తున్నాయి. కాబట్టి ఇప్పుడు బాధ్యత మారింది. 2.24 కోట్లమంది యువతులు క్యాంపస్‌లలో తమ స్థానాన్ని సాధించుకున్న తర్వాత, ఆ భారం విధాన నిర్ణేతలు, విద్యా సంస్థల అధిపతులు, పరిశ్రమ నాయకుల భుజాలపైకి చేరింది. ఇంజినీరింగ్, టెక్నాలజీ కోర్సుల్లో అమ్మాయిల చేరికను ప్రోత్సహించే లక్షిత స్కాలర్‌షిప్‌లు, మెంటర్‌షిప్ కార్యక్రమాలు; క్యాంపస్ నుంచి కార్యాలయం వరకూ భద్రమైన ప్రయాణ, పని వాతావరణం; పని ప్రదేశాల్లో శిశు సంరక్షణ సదుపాయాలు, సరళమైన పని విధానాలు; వివాహం–మాతృత్వం తర్వాత తిరిగి ఉద్యోగంలోకి వచ్చే మహిళలకు 'రిటర్న్‌షిప్' అవకాశాలు; బోధన, నాయకత్వ స్థానాల్లో మహిళలకు న్యాయమైన ప్రాతినిధ్యం –ఇవన్నీ కాగితాలమీది హామీలుగా కాక, క్షేత్రస్థాయి వాస్తవాలుగా మారాలి. తరగతి గది గడప వరకూ నడిచొచ్చిన ఆడపిల్ల అడుగులు, అక్కడితో ఆగిపోకూడదు. బోర్డు రూముల వరకూ, పరిశోధనశాలల వరకూ, నాయకత్వ పీఠాల వరకూ సాగాలి. నమోదు గణాంకాలు గర్వకారణమే; కానీ డిగ్రీలకు తగిన గౌరవప్రద ఉపాధి దక్కినప్పుడే ఆ గర్వానికి సార్థకత. చదువుల్లో సగం ఆకాశాన్ని అందుకున్న మన ఆడపిల్లలకు, సంపాదనలోనూ ఉద్యోగాల్లోనూ ఆ సగం వాటాను అందించడమే నిజమైన సమానత్వం. అదే వికసిత భారత్‌కు అసలైన కొలమానం కూడా! ■

---



జబ్బు పడ్డాక వైద్యం చేయించుకోవడం కంటే శరీరాన్ని రోగాలు రాకముందే జాగ్రత్తగా చూసుకోవడం చౌకైన పని. ఇప్పుడే బరువులు ఎత్తుతూ వ్యాయామం చేయడం అలవాటు చేసుకుంటే.. భవిష్యత్తులో ఇతరులపై ఆధారపడే పరిస్థితి రాదు. నాణ్యమైన నిద్ర.. భవిష్యత్తులో వచ్చే మతిమరుపును దూరం చేస్తుంది. ప్రపంచంలో అన్నింటికంటే ఉత్తమమైన వైద్యం ముందు జాగ్రత్త మాత్రమే! ఆరోగ్యం అనేది అకస్మాత్తుగా పోయేది కాదు.. రోజూ మనం చేసే చిన్న చిన్న నిర్లక్ష్యాల ఫలితం. అలాగే ఆరోగ్యం అనేది ఒక్కరోజులో వచ్చేదీ కాదు.. ప్రతిరోజూ మనం వేసే జాగ్రత్త అడుగుల బహుమతి. నేటి చెమట చుక్కే.. రేపటి ఔషధం కంటే విలువైనది!

–మహాదేవ

---

### వింతల్లో వింతలు

## భయపెట్టే అమాయకుడు



ముళ్ల కవచంతో, భయపెట్టే రూపంతో గ్రహాంతర జీవిని తలపించే ఓ భారీ గొంగళి పురుగు ప్రకృతి ప్రేమికులను ఆశ్చర్యపరుస్తోంది. 'క్యాబేజ్ ట్రీ మాత్' అనే చిమ్మట లార్వా అయిన ఈ పురుగు 70 మిల్లీమీటర్ల పొడవు, 15 మిల్లీమీటర్ల మందంతో ప్రపంచంలోని అతిపెద్ద గొంగళి పురుగుల్లో ఒకటిగా నిలుస్తోంది. తెల్లటి ముళ్లతో నల్లగా, పసుపు ముళ్లతో ఎర్రగా –రకరకాల రంగుల్లో కనిపించే ఇది చూడటానికి ప్రమాదకరంగా అనిపించినా, పూర్తిగా హానిరహితం. దీని ముళ్లు మెత్తగా ఉంటాయి; ఆ భయంకర రూపం కేవలం శత్రువులను తరిమికొట్టే సహజ రక్షణ వ్యూహం మాత్రమే. విచిత్రమేమిటంటే –ఉష్ణమండల ఆఫ్రికా ప్రజలు దీన్ని పోషకాహారంగా తింటారు. ఆర్థికంగానూ దీనికి ప్రాధాన్యముంది. చెట్ల ఆకులను శరవేగంగా తినేసే ఈ పురుగు, పూర్తిగా పెరిగాక మట్టిలో దాక్కుని, అందమైన రెక్కల గోధుమరంగు చిమ్మటగా మారి బయటికి వస్తుంది. రూపం భయపెట్టినా –ప్రకృతి చెప్పే పాఠం: కనిపించేదంతా నిజం కాదు!

పండ్లల్లో రారాజు మామిడిపండు. వేసవి కాలంలో మామిడి పండ్లు నోటిని ఊరిస్తాయి. మ్యాంగ్ ను చూసి టెంప్ట్ అవ్వని వాళ్లు ఉండరంటే అతిశయోక్తికాదు. కొందరైతే మామిడి పండ్లు జుర్రుకుంటూ తినేస్తుంటారు. మరికొందరు పండ్లను జ్యూస్ లుగా చేసుకుని మామిడి టేస్ట్ ను ఎంజాయ్ చేస్తారు. ఇంకొందరు.. మ్యాంగో షేక్ ను ఆస్వాదిస్తారు. సాధారణంగా మ్యాంగో షేక్ ను పాలతో తయారు చేస్తారు. కానీ పాలకు బదులుగా పెరుగుతో మ్యాంగో షేక్ ను ఎలా తయారు చేస్తారో..పెరుగుతో తయారు చేసిన మ్యాంగో షేక్ వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను తెలుసుకుందాం.



# పూదీనా మఖానా మ్యాంగో షేక్ టేస్ట్‌కు టేస్ట్..ఆరోగ్యానికి ఆరోగ్యం..

**పుదీనా మఖానా మ్యాంగో షేక్ ఎలా తయారు చేయాలంటే..**

మామిడి షేక్ చేయడానికి పెరుగు, మఖానా, చక్కెర, మామిడిపండ్లు అవసరం. పెరుగులో మామిడిపండు ముక్కలు వేసి మిక్సీ పట్టాలి. మఖానాను ముందుగా నీళ్లలో నానబెట్టాలి. నానబెట్టిన మఖానా బాగా నానిన తర్వాత వాటికి కొన్ని నీటిని కలపాలి. పైన పుదీనా ఆకులు, పంచదార, నల్ల ఉప్పు లేదా ఉప్పు వేయాలి. వీటన్నింటినీ కలిపి మిక్సీ చేస్తే మ్యాంగో షేక్ రెడీ.

**పుదీనా మఖానా మామిడి షేక్ వల్ల ప్రయోజనాలు:**

**ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది**

పుదీనా మఖానా ౧

మ్యాంగో షేక్ లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీవక్రియను పెంచుతుంది. జీర్ణక్రియ ప్రక్రియను వేగవంతం చేస్తుంది. ఈ మ్యాంగో షేక్ పొట్టను శుభ్రం చేయడంతో పాటు బరువు తగ్గడంలో కూడా సహాయపడుతుంది. ఆరోగ్యకరమైన జీర్ణక్రియ కోసం ఖచ్చితంగా మ్యాంగో షేక్ తాగండి.

**ఈ మాంగోషేక్ ప్రోబయోటిక్**

మ్యాంగో షేక్ ప్రోబయోటిక్స్‌తో నిండి ఉంటుంది. ఆరోగ్యానికి అనేక విధాలుగా పని చేస్తుంది. మ్యాంగో షేక్లో పెరుగును కలపడం ద్వారా ప్రోబయోటిక్, గట్ బ్యాక్టీరియాను ప్రోత్సహిస్తుంది. ఈ ప్రోబయోటిక్ కడుపుని చల్లబరుస్తుంది. వేసవిలో కడుపులో వచ్చే సమస్యలను నివారిస్తుంది.

**డీ హైడ్రేషన్ ను నివారిస్తుంది.**

మ్యాంగో షేక్ డీ హైడ్రేషన్ను నివారిస్తుంది. శరీరానికి తాజాదనాన్ని తెస్తుంది. అన్ని అవయవాలను ఆరోగ్యంగా ఉంచేందుకు సహాయపడుతుంది. మ్యాంగో షేక్ పాదాల మంటను తొలగించడమే కాకుండా చర్మ సమస్యలను నయం చేస్తుంది.

# బొప్పాయిని తిన్నతర్వాత వీటిని తింటే.. ఆస్పత్రి పాలవడం ఖాయం



బొప్పాయిలో పాపైన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది పొట్టలోని పొరను ఆరోగ్యంగా ఉంచుతుంది, అనేక చర్మ సమస్యలను నయం చేస్తుంది. దాంతో పాటు కడుపుని చల్లబరచడంతో పాటు, మలబద్ధకం, పైల్స్ సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. అయితే బొప్పాయి తిన్న తర్వాత తప్పక నివారించాల్సిన కొన్ని ఆహారాలు ఉన్నాయి. అవి ఆరోగ్యానికి హాని కలిగించవచ్చు.

**బొప్పాయి తిన్న తర్వాత ఏం తినకూడదు:**

**1. బొప్పాయి తిన్న తర్వాత పాలు తాగొచ్చా..?**

బొప్పాయి తిన్న తర్వాత పాలు తాగడం మానుకోవాలి. ఎందుకంటే బొప్పాయి, పాలు రెండూ కలిసి మిమ్మల్ని మలబద్ధకం లేదా కడుపు నొప్పికి గురి చేస్తాయి. ఇది ఆకస్మిక అజీర్ణం, ఉబ్బరం, విరేచనాలకు కారణమవుతుంది. కాబట్టి బొప్పాయి తిన్న తర్వాత పాలు తాగడం మానేయాలి.

**2. బొప్పాయి తిన్న తర్వాత టీ తాగాలా?**

బొప్పాయి తిన్న తర్వాత టీ తాగడం వల్ల పాపైన్ ఎంజైమ్‌తో చర్య జరుపుతుంది. ఇది చాలా సమస్యలను కలిగిస్తుంది. దీంతో పాటు, టీ ఆకులలో కాటెచిన్లు ఉంటాయి. ఇవి పాపైన్ సమ్మేళనంతో కలిసి గ్యాస్ట్రిక్ సమస్యలను కలిగిస్తుంది.

**3. బొప్పాయి తర్వాత గుడ్డు తినొచ్చా?**

బొప్పాయి తిన్న తర్వాత కోడిగుడ్లు తినడం వల్ల చాలా ఇబ్బందులు వస్తాయి. విటమిన్ సి, పాపైన్ ఎంజైమ్‌లు సమృద్ధిగా ఉండే ఈ బొప్పాయిలో, ప్రోటీన్స్, ఒమేగా-3లో కూడా సమృద్ధిగా ఉంటాయి. ఈ రెండింటినీ ఒకేసారి తినడం వల్ల కడుపులో గందరగోళం ఏర్పడుతుంది. ఇది మిమ్మల్ని చాలా కాలం పాటు అనారోగ్యానికి గురి చేస్తుంది. అజీర్ణం, వికారం, మలబద్ధకం, వాంతులు వంటి సమస్యలను కలిగిస్తుంది.

**4. బొప్పాయి తిన్న తర్వాత పెరుగు తినాలా?**

బొప్పాయి తిన్న తర్వాత పెరుగు తినడం వల్ల శారీరకంగా హాని కలుగుతుంది.

కానీ ఆయుర్వేద దృక్కోణంలో, బొప్పాయి వేడిగా ఉంటుంది, పెరుగు చాలా చల్లగా ఉంటుంది. అందుకే వీటిని కలిపి తీసుకోవడం వల్ల జలుబు, దగ్గు, తలనొప్పి వంటి సమస్యలు వస్తాయి.

**5. బొప్పాయి తిన్న తర్వాత నిమ్మకాయ తినొచ్చా?**

బొప్పాయి, నిమ్మకాయలు కలిసి మీ శరీరంలో హిమోగ్లోబిన్ లోపాన్ని కలిగించే విష సమ్మేళనాన్ని ఏర్పరుస్తాయి. ఈ లోపం రక్తహీనత రూపంలో ఉండవచ్చు. ఇది మిమ్మల్ని చాలా కాలం పాటు అనారోగ్యానికి గురి చేస్తుంది. కాబట్టి, బొప్పాయి తిన్న తర్వాత వీటిని తినకుండా ఉండండి.



# పైల్స్ ఉన్నోళ్లు దోశ గింజలు తింటే.. ఎంత మంచిదో తెలుసా

మీరు ఇంతకు ముందు దోసకాయ గింజలు తిన్నారా? చాలా మందికి తెలియని ఆసక్తికరమైన విషయమేమిటంటే ఈ విత్తనాలలో అనేక రకాలైన ఆరోగ్యానికి సహాయపడే కారకాలున్నాయి. దీనిలో ఫైబర్ కలిగి, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇది భేదిమందు లక్షణాలను కలిగి ఉంటుంది. అయితే పైల్స్ సమస్యతో బాధపడే వారికి ఈ దోసకాయ గింజలను తినడం ఎంత వరకు మంచిదో ఇప్పుడు చూద్దాం.

**పేగు కదలికను వేగవంతం చేస్తాయి**

దోసకాయ గింజలు ప్రేగు కదలికను వేగవంతం చేస్తాయి. వాస్తవానికి, ఇందులో పెద్ద మొత్తంలో ఫైబర్ ఉంటుంది. ఇది కడుపులోని నీటిని గ్రహిస్తుంది, మలానికి అదనపు మొత్తాన్ని జోడించడం ద్వారా ప్రేగు కదలికను వేగవంతం చేస్తుంది. ఇది ప్రేగు కదలికలను సులభతరం చేస్తుంది. పైల్స్ లక్షణాలను తగ్గిస్తుంది. నొప్పి, పేగు కదలికలలో ఉబ్బరం వంటివి కూడా తగ్గిస్తుంది.

**భేదిమందులా పనిచేస్తాయి**

దోసకాయ గింజలు భేదిమందులా పనిచేస్తాయి. అంటే పొట్టలోని మలాన్ని పలుచన చేసి సులభంగా బయటకు తీయడంలో సహాయపడుతుంది. ఈ విత్తనాలలో పుష్కలంగా ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ ప్రేగు కదలికలను సులభతరం చేస్తాయి, కడుపుని శుభ్రపరచడంలో సహాయపడతాయి.

**దోసకాయ గింజలను ఎలా ఉపయోగించాలి**

దోసకాయ గింజలను అనేక రకాలుగా ఉపయోగించవచ్చు. ముందుగా, మీరు ఈ విత్తనాలను చూర్ణం చేయాలి. వాటిని నీటిలో వేసి ఒక రకమైన పానీయంలాగా చేయాలి. రెండవది, మీరు ఈ విత్తనాలను నీటిలో నానబెట్టి, ఉదయం ఖాళీ కడుపుతో నల్ల ఉప్పుతో తినవచ్చు. పొట్టను సులువుగా శుభ్రం చేయడానికి ఇది ఉపయోగపడుతుంది.

## అయ్యయ్యో.. 3 మ్యాచ్‌లు ఫెయిల్.. అయినా వైభవ్‌ను వదలొద్దంటున్న మాజీ కోచ్!




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ జట్టు ఇంగ్లాండ్ పర్యటనలో వచ్చి అవకాశాలని అందుకోవడంతో 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ వైఫల్యం చెందడంపై క్రీడా వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తోంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున సంచలన ప్రదర్శనతో, టీమిండియాలో చోటు దక్కించుకున్న ఈ బీహార్ కుర్రాడు.. ఇంగ్లాండ్ పిచ్‌లపై పరుగులు సాధించడానికి చాలా కష్టపడుతున్నాడు. బ్రిస్టల్‌లో జరిగిన నాలుగో టీ20లో ఇండియా ఓడిపోగానే కోచ్ గౌతమ్ గంభీర్ స్టేడియంలోనే వైభవ్‌తో సీరియస్‌గా మాట్లాడిన వీడియో వైరల్ అయింది. ఇక భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ హెడ్ కోచ్ డబ్ల్యూవీ రామన్ మాట్లాడుతూ

**వైభవ్ ఆటపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.**

వైభవ్‌కి 20 మ్యాచ్‌లు ఆడే ఛాన్స్ ఇవ్వండి: రామన్

రెవ్‌స్పోర్ట్జ్ ఇంటర్వ్యూలో డబ్ల్యూవీ రామన్ మాట్లాడుతూ.. వైభవ్ సూర్యవంశీ టాలెంట్‌ను కేవలం ఒకే ఒక్క సిరీస్ స్కోర్లతో అంచనా వేయడం తగదన్నారు. సెలెక్టర్లు అతనిలోని అసలైన ప్రతిభను చూసే భారత జట్టుకు ఎంపిక చేశారని, కాబట్టి ఏమాత్రం జడ్జ్ చేయకుండా అతనికి కనీసం 15 నుంచి 20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో వరుసగా అవకాశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ప్రత్యర్థి బౌలర్లు కొత్త ప్లేయర్స్ బలహీనతలను త్వరగా పసిగడతారని, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో నిరంతరం అవకాశాలు ఇస్తేనే కుర్రాడికి ఆత్మవిశ్వాసం పెరిగి భవిష్యత్తులో అద్భుతాలు చేస్తాడని రామన్ ధీమా వ్యక్తం చేశారు.

**సచిన్ రికార్డ్ బ్రేక్.. జోఫ్రా ఆర్చర్ దెబ్బతో వైభవ్ విలవిల:**

ఈ నెల ప్రారంభంలో ఓల్డ్ ట్రాఫోర్డ్ వేదికగా జరిగిన రెండో టీ20లో వైభవ్ సూర్యవంశీ సరికొత్త చరిత్ర సృష్టించాడు. భారత క్రికెట్ చరిత్రలోనే అత్యంత పిన్న వయస్సులో (15 ఏళ్లకే) అంతర్జాతీయ అరంగేట్రం చేసిన ఆటగాడిగా నిలిచి, మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న సుదీర్ఘ రికార్డును బద్దలు కొట్టాడు. అయితే ఇంగ్లాండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ అదనపు పేస్, షార్ట్ పిచ్ బంతులతో ఈ యువ లెఫ్ట్ హ్యాండ్‌ను ముప్పతిప్పలు పెడుతున్నారు. ఇప్పటి వరకు ఆడిన మ్యాచ్‌ల్లో వైభవ్ మంచి ఆరంభాలు లభించినా భారీ స్కోర్లు చేయలేకపోయాడు. రెండో మ్యాచ్‌లో 14 రన్స్, మూడో మ్యాచ్‌లో 13 పరుగులు, నాలుగో మ్యాచ్‌లో 15 రన్స్ చేసి తర్వగానే వికెట్ పారేసుకున్నాడు.

**సౌతాంప్టన్‌లో కుర్రాడికి చివరి ఛాన్స్:**

వైభవ్ సూర్యవంశీ ప్రస్తుత ఫామ్ అతడికి శాపంగా మారింది. ఈరోజు సౌతాంప్టన్ వేదికగా జరగబోయే ఆఖరి ఐదో టీ20 మ్యాచ్‌లో వైభవ్ తన తప్పులను సరిదిద్దుకుని భారీ ఇన్నింగ్స్ ఆడాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. గంభీర్ ఇచ్చిన క్లాస్ రూమ్ టిప్స్ పాటిస్తూ ఈ బీహార్ కుర్రాడు ఇంగ్లీష్ బౌలింగ్‌ను ఎలా ఎదుర్కొంటాడో చూడాలి మరీ.

# మళ్లీ టాస్ గెలిచిన భారత్.. ఈసారి సంజు ఎంట్రీ.. ఫస్ట్ బ్యాటింగ్ ఇంగ్లాండ్‌దే




**హైదరాబాద్ పెన్ పవర్:** సౌతాంప్టన్ వేదికగా భారత్ వర్సెస్ ఇంగ్లాండ్ మధ్య జరుగుతన్న ఐదో టీ20 మ్యాచ్ టాస్ పడింది. ఈ చారిత్రాత్మక పోరులో టాస్ గెలిచిన భారత జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మొదట ఫీల్డింగ్ తీసుకున్నాడు. కాగా ఈ మ్యాచ్ గెలిచి ఐసీసీ ర్యాకింగ్స్ లో నెంబర్ స్థానాన్ని దక్కించుకోవాలని ఇంగ్లాండ్ చూస్తుండగా, ఇంగ్లీష్ జట్టుని ఓడించి, పరువు కాపాడుకోవాలని టీమిండియా చూస్తుంది. భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మాట్లాడుతూ.. పిచ్ పరిస్థితి మ్యాచ్ గడిచేకొద్దీ పెద్దగా మారదని, ఇంగ్లాండ్ నిర్దేశించే లక్ష్యాన్ని చేజ్ చేయడానికే తాము మొగ్గు చూపుతున్నట్లు తెలిపాడు. ఇప్పటికే సిరీస్ కోల్పోయినప్పటికీ, గతంలో జరిగిన పరాజయాల గురించి ఆలోచించకుండా ఆటగాళ్లు మంచిగా ఆడాలని చెప్పుకొచ్చాడు. ఇక తుది జట్టులో భారత్ రెండు కీలక మార్పులు చేసింది. గత కొన్ని మ్యాచ్‌లుగా బెంచ్‌కే పరిమితమైన సంజు శాంసన్ తో పాట సూర్యాంష్ షెడ్గేకు ప్లేయింగ్ 11లో అవకాశం కల్పించినట్లు శ్రేయస్ వెల్లడించాడు. ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ మాట్లాడుతూ.. ఈ మ్యాచ్‌లో గెలిస్తే తాము ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నంబర్ వన్ స్థానానికి చేరుకుంటామని, ఆ ఆలోచన తన మనస్సులో బలంగా నాటుకుపోయిందని బ్రూక్ చెప్పుకొచ్చాడు. భారత్‌ను 4--0తో క్లీన్ స్వీప్ చేసి అగ్రస్థానాన్ని దక్కించుకోవడమే తమ ఏకైక లక్ష్యమని తేల్చి చెప్పాడు. ఇంగ్లాండ్ జట్టు ఎలాంటి మార్పులు లేకుండా అదే విన్నింగ్ కాంబినేషన్‌తో బరిలోకి దిగుతోందని హ్యారీ పేర్కొన్నాడు.

**ఇరు జట్లు:**

భారత్: అభిషేక్ శర్మ, సంజు శాంసన్, ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), శ్రేయస్ అయ్యర్( కెప్టెన్), తిలక్ వర్మ, శివమ్ దూబే, సూర్యాంశ్ షెడ్గే, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ

ఇంగ్లాండ్: ఫిలిప్ సాల్ట్, జోస్ బట్లర్(వికెట్ కీపర్), హ్యారీ బ్రూక్(కెప్టెన్), జాకబ్ బెథెల్, టామ్ బాంటన్, సామ్ కర్రాన్, విల్ జాక్స్, లియామ్ డాసన్, జోఫ్రా ఆర్చర్, ఆదిల్ రషీద్, జోష్ టంగ్

## వరుసగా మూడు మ్యాచుల్లో ప్లాఫ్ షో.. ఐదో టీ20లో బుడ్డోడిపై బీసీసీఐ వేటు..!




**హైదరాబాద్ పెన్ పవర్:** సౌతాంప్టన్ వేదికగా ఇంగ్లాండ్?తో జరుగుతోన్న ఐదో టీ20లో ఇండియా టాస్ గెలిచింది. దీంతో టీమిండియా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. ఈ నామామాత్రపు మ్యాచులో భారత్ జట్టు రెండు మార్పులతో బరిలోకి దిగింది. ఆల్ రౌండర్ వాషింగ్టన్ స్థానంలో యంగ్ ప్లేయర్ సూర్యాన్ష్ షెడ్గే జట్టులోకి వచ్చాడు. 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ప్లేసులో స్టార్ బ్యాటర్ సంజూ శాంసన్ ప్లేయింగ్ లెవన్?లో చోటు దక్కించుకున్నాడు.

**వైభవ్ హ్యాట్రిక్ ప్లాఫ్ షో:**

ఐపీఎల్ 2026లో దుమ్మురేపిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఇంగ్లాండ్ టూర్?కు ఎంపికైన సంగతి తెలిసిందే. కానీ జట్టు కూర్పులో భాగంగా ఐర్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్?లో ఈ బుడ్డోడికి ఆడే అవకాశం రాలేదు. అయితే, భారత్ అనూహ్యంగా ఈ సిరీస్ కోల్పోయింది. ఐర్లాండ్ సిరీస్‌లో ఓపెనర్ సంజూ శాంసన్ దారుణంగా విఫలయ్యాడు. దీంతో జట్టు నుంచి సంజూను తప్పించి వైభవ్‌కు చాన్స్ ఇవ్వాలని పెద్ద ఎత్తున డిమాండ్లు వినిపించాయి.

ఇదే సమయంలో ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టీ20లో కూడా ఈ వరల్డ్ కప్ హీరో ఫెయిల్ అయ్యాడు. దీంతో సంజూపై వేటు వేసిన బీసీసీఐ.. వైభవ్ సూర్యవంశీకి అవకాశం కల్పించింది. భారీ అంచనాలతో అంతర్జాతీయ అరంగ్రేటం చేసిన వైభవ్ అంచనాల మేర రాణించలేదు.

వరుసగా మూడు మ్యాచుల్లో తక్కువ స్కోర్లకే పరిమితమయ్యాడు. ఇంగ్లాండ్ స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్ వైభవ్ బలహీనతను కనిపెట్టి దెబ్బకొట్టాడు. ఇదే సమయంలో టీమిండియాకు టీ20 వరల్డ్ కప్ అందించిన సంజూ శాంసన్?ను బీసీసీఐ అవమానిస్తోందని.. అతడిని జట్టులోకి తీసుకోవాలని డిమాండ్లు ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో హ్యాట్రిక్ ప్లాఫ్ షో చేసిన బుడ్డోడిని పక్కనపెట్టి ఐదో టీ20కి సంజూ శాంసన్?ను ఎంపిక చేసింది.



రోష్నీ వాలియా అద్భుతమైన చీరకట్టు లుక్

# మహేష్ గ్లోబల్ జర్నీ తో టాలీవుడ్ మరో మెట్టు పైకి!





వర్షపు చినుకులతో తడిసిన తెల్లని దుస్తుల్లో షామా సికందర్ రూపం ఎంతో హుందాగా ఉంది.

తెలుగు చిత్రసీమ దశాబ్దాలుగా ఎన్నో మార్పులకు లోనవుతున్నా? ప్రస్తుత తరుణంలో సూపర్ స్టార్ మహేష్ చేపట్టిన గ్లోబల్ జర్నీ టాలీవుడ్ స్థాయిని మరో మెట్టు పైకి ఎక్కిస్తుందన్నది కాదనలేని నిజం. ఒక ప్రాంతీయ స్టార్‌గా కాకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సినిమాలను ఎంచుకోవడం ద్వారా మహేష్ పరిశ్రమ గమనాన్ని మారుస్తున్నారు. రాజమౌళి – మహేష్ కాంబినేషన్ లో తెరకెక్కుతోన్న గ్లోబల్ ప్రాజెక్ట్ –వారణాసి– ప్రపంచ సినిమా పటంలో తెలుగు సినిమాకు ప్రత్యేక స్థానాన్ని కల్పిస్తుంది. మహేష్ లో ఉన్న సహజ సిద్ధమైన హాలీవుడ్ స్టార్ ఫీచర్స్ అదనపు బలాన్ని ఇస్తున్నాయి.

ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ యాక్షన్ హీరోగా మాత్రమే కాకుండా ప్రపంచ స్థాయి నటుడిగా కనిపించే పరిణతి, గ్లోబల్ ఆడియెన్స్‌ను ఆకట్టుకోవడానికి ప్లస్‌గా మారుతున్నాయి. మహేష్ బాడీ లాంగ్వేజ్, ఫ్యాషన్ సెన్స్ కెమెరా ముందు ప్రదర్శించే హావభావాలు హాలీవుడ్ సినిమాల్లో కనిపించే స్థాయి నటనకు ఏమాత్రం తక్కువ కాదని చెప్పొచ్చు. ముఖ్యంగా జర్మనీ వంటి దేశాల్లో కఠినమైన శిక్షణ తీసుకోవడం, సినిమా కోసం తనను తాను పూర్తిగా మార్చుకోవడం వంటివి మహేష్ అంకితభావాన్ని చాటుతున్నాయి. నటుడిగా తన పరిధిని విస్తరించుకోవాలని మహేష్ చేస్తున్న ప్రయత్నం టాలీవుడ్ లో మిగతా స్టార్ హీరోలకు కూడా ఓ కొత్త దారిని చూపి స్తోంది.ఇలాంటి క్రమశిక్షణతో కూడిన ప్రయాణం భవిష్యత్తులో మరింత మంది స్టార్ హీరోలు అంతర్జాతీయ వేదికలపై స్థిరపడటానికి మార్గదర్శకంగా నిలుస్తుంది. గ్లోబల్ మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకుని సినిమాలు రూపొందించడం తో టాలీవుడ్ సినిమాల బడ్జెట్ .. సాంకేతిక ప్రమాణాలు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. మహేష్ ఎంచుకుంటున్న కథాంశాలు కేవలం ఒక వర్గానికి పరిమితం కాలేదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు ఆకట్టుకునేలా ఉంటున్నాయి. ఇది తెలుగు నిర్మాతలు, దర్శకులు , సాంకేతిక నిపుణులకు అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకోవడానికి గొప్ప వేదికను అందిస్తోంది.ఈ మార్పు తో టాలీవుడ్ చిత్రాలకు దక్కుతున్న ఆదరణ బాక్సాఫీస్ వసూళ్లను మాత్రమే కాకుండా పరిశ్రమ గౌరవాన్ని కూడా పెంచుతోంది. గ్లోబల్ స్థాయిలో తెలుగు సినిమాలకి వస్తున్న గుర్తింపు భారతీయ సినిమా వైపు ప్రపంచం చూసేలా చేస్తోంది. మహేష్ లాంటి గ్లోబల్ ఐకాన్ లీడ్‌లో ఉండటం వల్ల అంతర్జాతీయ పంపిణీదారులు .. థియేటర్ల యజమానులు చిత్రాలను ప్రదర్శించడానికి ముందుకొస్తున్నారు. –వారణాసి– ప్రపంచ వ్యాప్తంగా 120 దేశాల్లో విడుదల చేస్తోన్న తీరు..రాజమౌళి గ్లోబల్ ఇమేజ్ తోనే ఇదంతా సాధ్యమవుతుంది.

చివరిగా మహేష్ గ్లోబల్ జర్నీ టాలీవుడ్ కు కొత్త శకాన్ని పరిచయం చేస్తోంది. ఆయనలోని స్టార్ ఫీచర్స్ , ప్రపంచ స్థాయి కథాంశాల కలయిక తెలుగు సినిమాను గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద విజేతలుగా నిలబెడుతుంది. రాబోయే రోజుల్లో మహేష్ ప్రాజెక్టులు తెలుగు సినిమా స్థాయిని ఎలా? అంతర్జాతీయ శిఖరాలకు చేరుస్తాయో వేచి చూడాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965